


# ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM
ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 01 | సంచిక: 349 | హైదరాబాద్ | శుక్రవారం | 06-06-2025 | పేజీలు: 08


ఇండియాకు రాని ప్రభాకర్ రావు..

## విచారణకు హాజరవుతారా..?

నేడు ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు విచారణపై సందిగ్ధం

సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇండియాకు ఇంకా ప్రభాకర్ రావు చేరుకోలేదు



2

## సింధూరం ఎంతో ప్రత్యేకం

పర్యావరణ దినోత్సవం సందర్భంగా.. సింధూరం మొక్క నాటిన మోదీ

వైరల్ అవుతున్న ఫోటోలు



3

# భారీ ఎన్‌కౌంటర్

## టాప్ కమాండర్ హతం!

నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో కూంబింగ్

మావోయిస్టులు ఎదురుపడడంతో కాల్పులు

వరుసగా అగ్ర నేతల మృతితో మావోయిస్టు పార్టీకి భారీ దెబ్బ



3

## విద్యకు టాప్ ప్రియార్టీ

నష్టాల నుంచి లాభాలలోకి ఆర్టీసీ

హైదరాబాదుకు 2800 ఎలక్ట్రిక్ బస్సులు

మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైద్య మంత్రి దామోదర



2

ప్లాస్టిక్ వాడకం

## తగ్గించండి

మొక్కలు పెంచండి

పర్యావరణ పరిరక్షణకు పాటు పడండి

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



2

త్వరలో జీహెచ్ఎంసీలో

## అంతర్గత మార్పులు

ఇప్పటికే 12కు తగ్గిన అదనపు కమిషనర్ల సంఖ్య

త్వరలో కొందరు ఐఏఎస్ లకు స్థాన చలనం

ఆ తర్వాతే బల్దియాలో అధికారుల కుదింపు

తెరపైకి రానున్న ప్రసాదరావు కమిటీ సిఫార్సుల అమలు

ఆరుకు తగ్గనున్న అదనపు కమిషనర్లు

ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు విభాగాల బాధ్యతలు




2

మిస్ ఇంగ్లాండ్ కు అవమానం జరిగితే

## బండి స్పందించరా?

రియల్ ఎస్టేట్ కంపెనీల ప్రమోషన్ల కోసమే మిస్ వరల్డ్ పోటీలు

జూపల్లి .. ఏ కమిటీ వేశారు ?ఏ విచారణ చేశారు ?

సీసీ టీవీ ఫుటేజ్ ఎందుకు బయట పెట్టరు ?

వాస్తవాలు బయటకు వచ్చే దాకా విశ్రమించం

ఆర్ టీఐ కింద దరఖాస్తు చేశాం

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



2

అమ్మాయిల స్వీయ రక్షణకు

## బాలికా రక్షక టీంలు

వేధిస్తే సంఘ బహిష్కరణ

ముట్టుకుంటే కఠిన శిక్షలు

త్వరలోనే బాల్య వివాహ నిరోధక చట్ట రూల్స్ అడాప్ట్

మంత్రి సీతక్క



2

## మాగంటికి సీరియస్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు తీవ్ర అస్వస్థత

గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలింపు

నెల రోజుల క్రితం ఏఐజీలో కిడ్నీ చికిత్స

ఆస్పత్రికి చేరుకుంటున్న బీఆర్ఎస్ నేతలు



3



# ఇండియాకు రాని ప్రభాకర్ రావు.. విచారణకు హాజరవుతారా..?

- నేడు ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు విచారణపై సందిగ్ధం
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇండియాకు ఇంకా ప్రభాకర్ రావు చేరుకోలేదు

హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):

తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విచారణకు పోలీసులు సిద్ధమయ్యారు. కోర్టు ఆదేశాల ప్రకారం..గురువారం పోలీసుల ముందు విచారణకు.. ప్రభాకర్ రావు హాజరుకావాల్సి ఉంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో.. ఆయనే కీలక నిందితుడిగా ఉన్నారు. కేసు నమోదైన తర్వాత.. ప్రభాకర్ రావు అమెరికా పారిపోయారు.

14 నెలలుగా అమెరికాలోనే ఉంటున్న ప్రభాకర్ రావు.. ఇంకా భారత్ తిరిగి రాలేదని తెలుస్తోంది. ఇండియా రావడానికి మరింత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. వన్ టైమ్ ట్రావెలింగ్ వీసా ఇంకా తీసుకోలేదని తెలుస్తోంది. ట్రావెలింగ్ వీసా తీసుకున్న 3 రోజుల్లో ఇండియాకు రావాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రభాకర్ రావుకి వన్ టైం ఎంట్రీ ట్రావెలింగ్ వీసా ఇవ్వాలని సంబంధించిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇతర దేశాలకు వెళ్లొద్దని కూడా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రభాకర్ రావును విచారిస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో విచారణకు అనేక ఆటంకాలు ఎదురౌతున్నాయి.

**ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు**

బీఆర్ఎస్ హయాంలో SIB కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని పంజాగుట్ట పోలీసులు 2024, మార్చి 10న కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావే. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే భారత్‌కు తిరిగి వస్తానని గతంలో హైకోర్టును ఆశ్రయించారు ప్రభాకర్‌రావు. కానీ.. ఆ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేశారాయన. సుప్రీం కోర్టు ఆదేశాలతో విచారణకు హాజరవుతున్నారు.

**ట్యాపింగ్ వెనకున్న పెద్దల పేర్లు బయటకు వస్తాయా..?**

ప్రభాకర్‌రావును ప్రశ్నించేందుకు సిట్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఏ ప్రశ్నలు అడగాలి.. ఆయన నుంచి ఎలాంటి సమాచారం సేకరించాలనే అంశంపై దృష్టిపెట్టారు. ట్యాపింగ్ కేసులో పోలీసు అధికారులు, ప్రైవేట్ వ్యక్తి శ్రవణ్‌రావు మధ్య లింక్ ఎలా కుదిరింది..? ఎవరి ఆదేశాలతో ఫోన్లను ట్యాప్ చేశారు..? ఆ సమాచారాన్ని ఎవరెవరికి చేరవేశారు..? అన్న ప్రశ్నలు సంధించే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ నిబంధనలను పాటించారా..? హార్డ్‌డిస్క్‌లను ఎందుకు ధ్వంసం చేశారు..? ఎవరి ఆదేశాలతో వాటిని నాశనం చేశారు..? అన్న క్వశ్చన్స్ వేసే అవకాశం ఉంది. ఇప్పటివరకు అరెస్ట్ అయిన వారి వాంగ్మూలాల ఆధారంగా ప్రభాకర్‌రావుపై సిట్ అధికారులు ప్రశ్నలు సంధించబోతున్నారు.

**ప్రభాకర్‌రావు ఇచ్చే సమాచారంపై ఉత్కంఠ**

ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ట్యాపింగ్ చేశారన్నదే కీలకం. గత ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే ట్యాపింగ్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే వారి పేర్లను బయటపెడతారా..? ఏదైనా మెలిక పెట్టి దాట వేస్తారా..? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే అన్ని ఆధారాలు ముందు పెట్టి.. ప్రభాకర్‌రావును సిట్ అధికారులు ప్రశ్నించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభాకర్‌రావు అబద్ధాలు చెప్పినా.. డొంక తిరుగుడు సమాధానాలు చెప్పినా.. అడ్డంగా దొరికిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

**ఫోన్ ట్యాపింగ్‌పై కీలక ఆరోపణలు చేశారు రేవంత్‌రెడ్డి**

పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్‌పై కీలక ఆరోపణలు చేశారు రేవంత్‌రెడ్డి. తమ ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని.. ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. హార్డ్‌డిస్క్‌లు మాయం కావడంతో ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది ప్రభుత్వం. విచారణకు ఆదేశించింది. కేవలం ప్రతిపక్షంలోని వారి ఫోన్లను మాత్రమే ట్యాప్ చేశారా..? లేక రిటైర్డ్ జడ్జ్‌ల ఫోన్లను కూడా ట్యాప్ చేశారా..? అన్న అనుమానాలు ఉన్నాయి. అసలు ఎందుకిలా ట్యాప్ చేయాల్సి వచ్చిందన్నది కూడా విచారణలో బయటపడే అవకాశముంది.

**ప్రభాకర్‌రావు నోరు విప్పుతాడా..? ప్రీప్లాన్‌గా వ్యవహరిస్తారా..?**

సిట్ విచారణలో ప్రభాకర్‌రావు నోరు విప్పుతాడా..? ప్రీప్లాన్‌గా వ్యవహరిస్తారా..? ఆయన నిజాలు చెప్తే.. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన చాలా మంది పెద్దల పేర్లు బయటకు వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పుడు వారందరిలోనూ ఆందోళన మొదలైంది. మరోవైపు ప్రభుత్వం ప్రభాకర్‌రావుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని భావిస్తోంది.

# విద్యకు టాప్ ప్రియార్టీ

- నష్టాల నుంచి లాభాలలోకి ఆర్టీసీ
- హైదరాబాదుకు 2800 ఎలక్ట్రిక్ బస్సులు
- మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైద్య మంత్రి దామోదర

హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రియార్టీ ఇస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని పల్లవి స్కూల్ ను రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ లు విజిట్ చేసి ప్రారంభించారు.ఈసందర్భంగా మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, టీచర్ల నియామకాలు,గురుకులాలలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యకు సంబంధించి ఎన్నో నూతన సాంకేతిక విధానాలు అమలులోకి వచ్చినందున వాటిని సద్వినియోగం చేసుకొని విద్యావంతులు కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో డ్రాప్ అవుట్ లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాలు ప్రజల సహకారం లేకపోతే అవి విజయవంతం కావన్నారు. ప్రభుత్వ పథకాల అమలుకు ప్రతి ఒక్కరు తమ సహకారం అందించాలని కోరారు. రాష్ట్ర ఆర్టీసీ నష్టాల ఊబిలో నుంచి లాభాల బాట పట్టిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే ఆర్టీసీని లాభాల బాటలోకి తెచ్చామని సంతోషం వ్యక్తం చేశారు. ఆర్టీసీ సిబ్బందికి శాఖ పరంగా ఇచ్చే సదుపాయాలన్నీ ఇస్తూ వారికి అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉపయోగకరంగా మారిందన్నారు.మహిళలు ఆర్థికంగాఅభివృద్ధిచెందేందుకు డ్వాక్రా మహిళా గ్రూపు సభ్యులకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులను సమకూరుస్తున్నామన్నారు. ఇప్పటికే 150 బస్సులను మహిళా సంఘాలకు ఇచ్చామని త్వరలోనే మరో 400 బస్సులు వారికి ఇస్తామన్నారు.హైదరాబాదులో కాలుష్య నివారణ కోసం త్వరలోనే 2800 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రస్తుతమున్న డీజిల్ బస్సులను ఓఆర్ఆర్ అవతల ప్రయాణించే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పిస్తున్న ఆర్టీసీ బస్సులు పబ్లిక్ లైఫ్ లైన్ బస్సులుగా ఆయన అభివర్ణించారు. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కాలుష్యం నివారణ కోసం ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని మంత్రి పిలుపునిచ్చారు. కాలుష్యం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని ఆరోగ్యాలు కాపాడుకునేందుకు మొక్క నాటడం దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. మంత్రి స్వయంగా మొక్క నాటారు. ఈ సమావేశంలో ఎంపి సురేష్ శెట్కార్, ఎమ్మెల్యే మాణిక్ రావు, రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉజ్వల్ రెడ్డి, ఇంచార్జి శుక్లవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంతరావుపాటిల్, కె.భాస్కర్ రెడ్డి, బి.శ్రీనివాస్ రెడ్డి, పి.నర్సింహారెడ్డి, రామలింగారెడ్డి,శ్రీధర్ రెడ్డి, అప్పారావు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ వాడకం తగ్గించండి

- మొక్కలు పెంచండి
- పర్యావరణ పరిరక్షణకు పాటు పడండి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- మొక్కలు నాటిన కేంద్ర మంత్రులు, ఎంపీ
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా

హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):

కర్బన ఉద్గారాలు మొదలు, ప్లాస్టిక్ వాడకం సహా అనేక కాలుష్య కారకాలను తగ్గించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు గాను ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన కోరారు. పర్యావరవరణ పరిరక్షణను ప్రజలు తమ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కిషన్ రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో గురువారం మొక్కలు నాటారు. ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని, ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన పలువురు విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వారికి శాలువా కప్పి అభినందించారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గురించి వారికి వివరించారు. అనంతరం విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకుని వాటిని సాధించే వరకు పట్టు విడవకుండా నిరంతరం కృషి చేయాలని తెలియజేశారు. పర్యావరణాన్ని కాపాడుతూ.. క్షేత్రస్థాయిలో ఎంతో మంది పుడమి తల్లికి సేవ చేస్తున్నారని, వారందరి నుంచి మనమంతా స్ఫూర్తిని పొందవలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీ జంతర్ మంతర్ లోని తన అధికారిక నివాసంలో బండి సంజయ్ మొక్కలు నాటారు. తన కార్యాలయ సిబ్బందితో మొక్కలు నాటించారు. మొక్కల పెంపకం ద్వారా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. వాతావరణ మార్పులపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ 'ఏక్ పేడ్ మా కే నామ్' నినాదంతో తమ తల్లి పేరుతో ఒక్కో మొక్కను నాటాలని సూచించారు. ఇదిలా ఉండగా హుస్నాబాద్ఇందుర్తి ప్రయాణికులకు కష్టాలు తొలగనున్నట్లు బండి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ డబుల్ లేన్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, కాగా శుక్రవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ దీన్ని ప్రారంభించనున్నారు. బండి కృషితో నిర్ణీత గడువులోపే(5 నెలల్లోపే) రోడ్డు నిర్మాణాన్ని అధికారులు పూర్తి చేశారు. ఇదిలా ఉండగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలోని పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్క నాటారు. కాగా నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాజ్య సభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ సైతం మొక్క నాటారు. ఈ కార్యక్రమం ఆగస్ట్ 15 వరకు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.



# త్వరలో జీహెచ్‌ఎంసీలో అంతర్గత మార్పులు

- ఇప్పటికే 12కు తగ్గిన అదనపు కమిషనర్ల సంఖ్య
- త్వరలో కొందరు ఐఏఎస్ లకు స్థాన చలనం
- ఆ తర్వాతే బల్దియాలో అధికారుల కుదింపు
- తెరపైకి రానున్న ప్రసాదరావు కమిటీ సిఫార్సుల అమలు
- ఆరుకు తగ్గనున్న అదనపు కమిషనర్లు
- ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు విభాగాల బాధ్యతలు

హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):

గ్రేటర్ హైదరాబాద్ మహానగరాభివృద్ధితో పాటు నగరవాసులకు ముఖ్యమైన పౌర సేవలందించే జీహెచ్ఎంసీలో త్వరలోనే అంతర్గతంగా మార్పులు జరిగే అవకాశాలున్నట్లు విశ్వసనీయ సమాచారం. అత్యవసర సేవలందించే జీహెచ్ఎంసీలో ఇప్పటికే అదనపు కమిషనర్ల సంఖ్య ఎక్కువైపోవటం, ఇంత మంది అవసరమా? అన్న ఆలోచన కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కు రావటంతో త్వరలోనే అదనపు కమిషనర్ల సంఖ్య కుదించే అవకాశం లేకపోలేదన్న వాదనలున్నాయి. జీహెచ్ఎంసీ గ్రేటర్ గా రూపాంతరం చెందిన తర్వాత స్టాఫ్ ప్యాటన్ కోసం అప్పట్లో సర్కారు నియమించిన ప్రసాదరావు కమిటీ సిఫార్సుల మేరకు జీహెచ్ఎంసీలో ఆరుగురు అదనపు కమిషనర్లు ఉండాలి. కానీ కొద్ది రోజుల క్రితం వరకు అదనపు కమిషనర్ల సంఖ్య 14గా ఉండేది. గతంలో హెల్త్, శానిటేషన్ విభాగాలకు ఒకే అదనపు కమిషనర్ ఉండే వారు, కాలక్రమేనా న్యాన్ క్యాడర్ ఆఫీసర్లను జీహెచ్ఎంసీలో అకామిడెట్ చేసేందుకు హెల్త్, శానిటేషన్ విభాగాలను విడదీసి, ఇద్దరు నాన్ క్యాడర్ ఆఫీసర్లకు అదనపు కమిషనర్లుగా బాధ్యతలు అప్పగించారు. ఈ రకంగా ప్రసాదరావు కమిటీ సిఫార్సుల ప్రకారం ఆరు కు పరిమితం కావల్సిన అదనపు కమిషనర్ల సంఖ్య 12కు తగ్గింది. ఆర్. వి. కర్ణన్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కర్ణన్ కన్నా ఒక సంవత్సరం సీనియర్ ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన ఓ ఐఏఎస్ ఆఫీసర్ విధులకు రావటమే మానేశారు. జీహెచ్ఎంసీ నుంచి బయటకు బదిలీ చేయించుకునే ప్రయత్నంలో సదరు అధికారి ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత మరో నాన్ క్యాడర్ అధికారి అదనపు కమిషనర్ గా విధులు నిర్వహిస్తూ బదిలీ అయ్యారు.

**త్వరలోనే ఐఏఎస్ ల బదిలీలు?**

గురువారం రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం నిర్వహించిన నేపథ్యంలో రేపోమాపో ఐఏఎస్ ఆఫీసర్ల బదిలీల ఉత్తర్వులు వచ్చే అవకాశాలున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతుంది. సర్కారు ఒకవేళ ఐఏఎస్ ఆఫీసర్ల బదిలీలు చేపడితే, జాబితాలో జీహెచ్ఎంసీలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఐఏఎస్ ఆఫీసర్లు ఉండనున్నట్లు సమాచారం. జీహెచ్ఎంసీ నుంచి నలుగురు ఐఏఎస్ ఆఫీసర్లు బయటకు వెళ్లే అవకాశాలుండగా, కేవలం ఇద్దరు ఐఏఎస్ ఆఫీసర్లు జీహెచ్ఎంసీకి వచ్చే అవకాశాలున్నట్లు సమాచారం. ఆ తర్వాత కమిషనర్ ఆర్. వి. కర్ణన్ అంతర్గత బదిలీల ప్రక్రియ చేపట్టాలని యోచిస్తున్నట్లు తెలిసింది. గతంలో మాదిరిగా ఒక్కో ఆఫీసర్ కు రెండు నుంచి మూడు విభాగాలను కేటాయించి, జీహెచ్ఎంసీలో అదనపు కమిషనర్ల సంఖ్యను తగ్గించాలని కమిషనర్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఒక్కో విభాగానికే పరిమితమైన పలువురు నాన్ క్యాడర్ ఆఫీసర్లకు రెండు నుంచి మూడు విభాగాల ను పర్యవేక్షించే బాధ్యతలను కర్ణన్ అప్పగించే అవకాశాలున్నట్లు సమాచారం.

**అదనపు కమిషనర్ల సంఖ్య తగ్గితే..**

జీహెచ్ఎంసీలో అదనపు కమిషనర్ల సంఖ్య ఒక్కసారిగా 12 కు తగ్గినా, ఇంకా తగ్గితే జీహెచ్ఎంసీకి ఆర్థిక భారం తగ్గుతుందన్న అభిప్రాయాలున్నాయి. ఇటీవల నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బల్దియా కమిషనర్ ఆర్. వి. కర్ణన్ సైతం అదనపు కమిషనర్ల సంఖ్యపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. అదనపు కమిషనర్ల కుదింపునకు సంబంధించి కమిషనర్ ఓ సీనియర్ అధికారితో చర్చించినట్లు తెలిసింది. ఒక్కో అదనపు కమిషనర్ కు స్పెషల్ చాంబర్, వెహికల్ తో పాటు కింది స్థాయి సిబ్బంది కేటాయించటంతో వీరి వల్ల జీహెచ్ఎంసీపై ఆర్థిక భారం పడుతున్నందున ప్రసాదరావు కమిటీ సిఫార్సుల ప్రకారం దశల వారీగా వీరి సంఖ్యను ఆరుకు కుదించాలని కమిషనర్ ఇదివరు భావించగా, ఇపుడు జీహెచ్ఎంసీలోని ఐఏఎస్ ఆఫీసర్లకు బదిలీలైన తర్వాత కుదింపు ప్రక్రియపై కమిషనర్ దృష్టి సారించనున్నట్లు తెలిసింది. సర్కారు ఇటీవలే ఏడుగురు ఐపీఎస్ ఆఫీసర్లకు స్థానచలనం కల్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో త్వరలోనే ఐఏఎస్ ఆఫీసర్ల బదిలీలు కూడా చేసే అవకాశాలున్నట్లు సమాచారం. ఈ బదిలీల కోసం జీహెచ్ఎంసీలోని నలుగురు ఐఏఎస్ ఆఫీసర్లు ఎదురుచూస్తున్నారు. అదనపు కమిషనర్లుగా, జోనల్ కమిషనర్లుగా విధులు నిర్వహిస్తున్న పలువురు ఐఏఎస్ ఆఫీసర్లు జిల్లాలకు కలెక్టర్ గా విధులు నిర్వహించాలని భావిస్తూ, బదిలీలను కోరుకుంటున్నట్లు తెలిసింది. బదిలీల కోసం కొందరు అధికారులు ఇప్పటికే సచివాలయ స్థాయిలో ప్రయత్నాలు చేసుకుంటుండగా, మరి కొందరు జోనల్ కమిషనర్లు తమ పరిధిలో తాము నిర్వహించాల్సిన విధులన్నింటినీ పక్కన బెట్టి బదిలీల కోసమే ఎదురుచూస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.





# మిస్ ఇంగ్లాండ్ కు అవమానం జరిగితే బండి స్పందించరా?

- రియల్ ఎస్టేట్ కంపెనీల ప్రమోషన్ల కోసమే మిస్ వరల్డ్ పోటీలు
- జూపల్లి .. ఏ కమిటీ వేశారు ?ఏ విచారణ చేశారు ?
- సీసీ టీవీ ఫుటేజ్ ఎందుకు బయట పెట్టరు ?
- వాస్తవాలు బయటకు వచ్చే దాకా విశ్రమించం
- ఆర్ టీఐ కింద దరఖాస్తు చేశాం
- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):

మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీకి అవమానం జరిగితే కేంద్రమంత్రి బండిసంజయ్ స్పందించరా? అని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. భారత్ మాతాకీ జై అనే బండి.. కాంగ్రెస్, బీజేపీల మధ్య బలమైన బంధం ఉంది కనుకే స్పందించలేదా ? అని నిలదీశారు. తెలంగాణ భవన్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అందాల పోటీలు భారత సంస్కృతిని కించపరిచేలా జరిగాయని ఆరోపించారు. మిస్ ఇంగ్లాండ్ మిల్లా మెగీ అందాల పోటీల నుంచి అవమానకార పద్ధతుల్లో వైదొలిగిన తీరు రాష్ట్ర ప్రతిష్ట ను మంట గలిపిందన్నారు. వేరే దేశం లో ఎక్కడైనా ఇలాంటిది జరిగితే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసేవారని, ఇంత పెద్ద ఘటన జరిగినా ప్రభుత్వ పెద్దలు తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారన్నారు. సీఎం ఇప్పటికే చెంపలు వేసుకుని మిస్ ఇంగ్లాండ్ కు క్షమాపణ చెప్పి ఉండాల్సిందన్నారు. అందాల పోటీలు సీఎం రేవంత్ కుటుంబ వ్యవహారం కాదు ..కానీ కుటుంబ వ్యవహారంగా మార్చారన్నారు. ఈ కేసు పై హ్యూమన్ రైట్స్ కమిషన్ , ఉమెన్ కమిషన్ సుమోటో గా తీసుకొని ఎందుకు స్పందించలేదన్నారు. కనీసం ఎఫ్ ఐ ఆర్ కూడా నమోదు చేయలేదన్నారు. రియల్ ఎస్టేట్ కంపెనీలకు ప్రమోషన్ కోసం అందాల పోటీలు నిర్వహించారా ? అని నిలదీశారు. అందాల పోటీల ప్రొటొకాల్స్ ఏమిటో బ్యూరో క్రాట్లు ప్రభుత్వ పెద్దలకు చెప్పారా ? కాంగ్రెస్ నేతలు అందాల పోటీల్లో ఎందుకు చొరబడ్డారని ప్రశ్నించారు. మిస్ ఇంగ్లాండ్ వ్యవహారం పై విచారణ లేదని మంత్రి జూపల్లి అంటున్నారని, ఏ విచారణ జరిపి మంతి అలా అంటున్నారు ?ఏ కమిటీ వేశారు ?ఏ విచారణ చేశారు ? సీసీ టీవీ ఫుటేజ్ ఎందుకు బయట పెట్టదు ? అని నిలదీశారు. ఈ ఘటన పై వాస్తవాలు బయటకు వచ్చే దాకా విశ్రమించబోమన్నారు. ఆర్ టీ ఐ చట్టం కింద ఇప్పటికే దరఖాస్తు చేశామని, సోనియా ,ప్రియాంక కూడా ఈ ఘటన మీద స్పందించాలని డిమాండ్ చేశారు. మీనాక్షి నటరాజన్ సాటి మహిళకు జరిగిన అన్యాయం పై స్పందించరా ? అని ప్రశ్నించారు. గద్వాల్ జిల్లా ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ కి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతుల పై పోలీసుల దమన కాండను బీఆర్ఎస్ ఖండిస్తోందన్నారు. రైతులు అడిగిన దాంట్లో న్యాయం ఉందని పేర్కొన్నారు. గద్వాల్ ఘటనలో అతిగా ప్రవర్తించిన పోలీసుల పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# అమ్మాయిల స్వీయ రక్షణకు బాలికా రక్షక టీంలు

- వేధిస్తే సంఘ బహిష్కరణ
- ముట్టుకుంటే కఠిన శిక్షలు
- త్వరలోనే బాల్య వివాహ నిరోధక చట్ట రూల్స్ అడాప్ట్
- మంత్రి సీతక్క


హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):



ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి మీద కొన్నిసార్లు రక్షణ కరువు అవుతుందని, అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీములను ఏర్పాటు చేస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారని హెచ్చరించారు. రాజేంద్రనగర్ లో నిర్వహిస్తున్న మేధో మథన సదస్సు ముగింపు సభలో గురువారం మంత్రి పాల్గొని మాట్లాడారు. అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. చెడుగా ప్రవర్తిస్తే ఎలాంటి శిక్షలు అనుభవించాల్సి వస్తుందో అబ్బాయిలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీలకు సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామన్నారు. జిల్లాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చు అన్నారు. మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో ఒక అడ్వైజరీ కమిటీ నియమిస్తామన్నారు. బాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహ కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. త్వరలో మహిళల హక్కుల మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళ భద్రత కోసం ప్రతిష్ట విధానాలను రూపొందిస్తామన్నారు. తెలంగాణ ఏర్పాటై 10ఏళ్లయినా ఇప్పటికీ బాల్య వివాహ నిరోధక చట్ట రూల్స్ ను అడాప్ట్ చేసుకోకపోవడం బాధాకరం అన్నారు. త్వరలో రూల్స్ ను అడాప్ట్ చేసుకుంటామన్నారు. అంగన్వాడి గదుల్లోని దేశ భవిష్యత్తు ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను, హాజరును పెంచాలని సూచించారు.

# మాగంటికి సీరియస్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు తీవ్ర అస్వస్థత
- గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలింపు
- నెల రోజుల క్రితం ఏఐజీలో కిడ్నీ చికిత్స
- ఆస్పత్రికి చేరుకుంటున్న బీఆర్ఎస్ నేతలు



**హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):**

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన ఆరోగ్య పరిస్థితి సీరియస్ కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రి తరలించారు. అక్కడకు చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి ఆందోళన కరంగా ఉందని అనుచరులు పేర్కొంటున్నారు. విషయం తెలియడంతో గురువారం సాయంత్రం మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఆరోగ్య వివరాలను వైద్యులతో పాటు మాగంటి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గోపీనాథ్‌కు ఐసీయూలో చికిత్స కొనసాగుతున్నదని హరీశ్ రావు వెల్లడించారు. మాగంటి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. గత నెల రోజుల క్రితం ఏఐజీ ఆస్పత్రిలోనే కిడ్నీ చికిత్స చేయించుకున్నారు. ఇప్పుడు మళ్లీ చేరడంతో ఆయన అనుచరులు ఆందోళన చెందుతున్నారు.

# సింధూరం ఎంతో ప్రత్యేకం

- పర్యావరణ దినోత్సవం సందర్భంగా.. సింధూరం మొక్క నాటిన మోదీ
- వైరల్ అవుతున్న ఫోటోలు

**హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసం '7 లోక్ కల్యాణ్ మార్గ్'లో సింధూరం మొక్కను నాటారు. 1971 ఇండియా, పాకిస్థాన్ యుద్ధ సమయంలో అసామాన్యమైన పరాక్రమం ప్రదర్శించిన కచ్ ప్రాంతానికి చెందిన మహిళ ఒకరు తనకు ఈ మొక్కను అందించారని మోదీ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. "1971 యుద్ధ సమయంలో గుజరాత్‌లోని కచ్ ప్రాంతానికి చెందిన మాతృమూర్తులు, సోదరీమణులు ధైర్యానికి, శౌర్యానికి ప్రతీకగా నిలిచారు. ఈ మధ్య నేను గుజరాత్ పర్యటనకు వెళ్లినప్పుడు ఒక మాతృమూర్తి ఈ సింధూరం మొక్కను అందజేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయంలో మొక్క నాటడం ఎంతో గర్వంగా భావిస్తున్నాను. మన దేశ మహిళల శౌర్యానికి, స్ఫూర్తికి ఈ మొక్క బలమైన ప్రతీకగా నిలుస్తుంది" అని మోదీ వ్యాఖ్యానించారు. మొక్క నాటుతున్న రెండు ఫొటోలను కూడా ఆయన షేర్ చేశారు. కాగా, సింధూరం మొక్క నాటేందుకు ప్రధాని స్వయంగా తానే గుంతను సిద్ధం చేశారు. మొక్క నాటాక నీళ్లు పోశారు.

**ఉగ్రదాడి నేపథ్యంలో ప్రాధాన్యత**

ఏప్రిల్ నెలలో జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. హిందూ మహిళల ముందే వారి భర్తలను కర్కశంగా కడతేర్చారు. దీంతో, బాధిత హిందూ మహిళలకు నుదుటన సింధూరం దూరమైంది. తీవ్ర ఉద్రిక్తత రాజేసిన ఈ ముష్కర ఘటనకు ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ సింధూర్' చేపట్టి పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నక్కివున్న ఉగ్రవాదులే లక్ష్యంగా వరుస దాడులతో విరుచుకుపడింది. ఆపరేషన్ విజయవంతమైన తర్వాత, బీహార్‌లో నిర్వహించిన ఓ బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, 'నా నరనరాల్లో ప్రవహించింది రక్తం కాదు, సింధూరం' అని వ్యాఖ్యానించారు. సింధూరం గన్‌పౌడర్‌గా మారితే పర్యవసానాలు ఏవిధంగా ఉంటాయో శత్రువులకు అర్థమైందనుకుంటానని ఆయన హెచ్చరించారు. ఇదే క్రమంలో ఆయన సింధూరం మొక్కను నాటి, ఆ విషయాన్ని గుర్తు చేశారు.

**సింధూరం మొక్క ప్రత్యేకత ఏమిటంటే?**

భారతదేశంలో సింధూరం మొక్కకు మతపరమైన, సాంస్కృతిక, ఔషధ ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ మొక్కను దేశంలోని పలు ప్రాంతాల్లో 'అన్నట్టో', 'బిక్సా' అనే పేర్లతో కూడా పిలుస్తుంటారు. 'రెడ్ ఆరెంజ్' వర్ణాన్ని సింధూరం తయారీలో కూడా వినియోగిస్తుంటారు. హిందూ మహిళలు పవిత్ర తిలకంగా దిద్దుకునే సింధూరం పొడిని కూడా తయారు చేస్తారు. హిందూ మహిళలు తమ వైవాహిక స్థితిని, భర్తపై ప్రేమను చాటిచెప్పేందుకు నుదుటన సింధూరాన్ని దిద్దుకుంటారు. సింధూరం మొక్క విత్తనాల నుంచి ఈ రంగును సేకరిస్తారు. సహజసిద్ధమైన రంగు కావడంతో చర్మ సౌందర్య ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తుల్లో కూడా ఉపయోగిస్తారు. ఆయుర్వేదంలో కూడా ఈ మొక్కకు చాలా ప్రాధాన్యత ఉంది. యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీయాక్సిడెంట్స్‌లలో ఉపయోగిస్తారు. చర్మ సమస్యలతో పాటు అజీర్తికి సంబంధించిన సమస్యల చికిత్సలో కూడా సింధూరం మొక్కలను వినియోగిస్తుంటారు.



# వృక్షో రక్షతి రక్షితః

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం... మార్పుగా మారండి - ఎక్కువ మొక్కలు నాటండి
- మన భవిష్యత్తు వర్ధిల్లేలా ప్రకృతిని పెంచుకుందాం
- కేశంపేట మండల మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



**కేశంపేట్ జూన్ 05(ప్రజాక్షేత్రం):** వృక్షో రక్షతి రక్షితః, ఇప్పుడు మనం వృక్షాలను పెంచి రక్షించుకుంటే భవిష్యత్తులో మన ముందు తరాలను వృక్షాలు రక్షిస్తాయని, మన భవిష్యత్తు వర్ధిల్లేలా ప్రకృతిని పెంచుకుందామని ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేశంపేట మండలం మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవం, మార్పుగా మారండి ఎక్కువ మొక్కలు నాటండి, తక్కువ వ్యర్థాలు చేయండి మరియు మనకు జీవితాన్ని ఇచ్చే వృక్ష సంపదను రక్షించండని కేశంపేట్ మాజీ జెడ్పిటిసి శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆమె తన వంతుగా మొక్కలు నాటి అందరూ మొక్కలు నాటి భావితరాలకు మేలు చేయాలని కోరారు.

# భారీ ఎన్‌కౌంటర్ టాప్ కమాండర్ హతం!

- నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో కూంబింగ్
- మావోయిస్టులు ఎదురుపడడంతో కాల్పులు
- కీలక నేత సుధాకర్ మృతి?
- భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం
- ఇప్పటికే ఇద్దరు టాప్ కమాండర్ల హతం
- ఆపరేషన్ కగార్‌లో దూకుడు
- వరుసగా అగ్ర నేతల మృతితో మావోయిస్టు పార్టీకి భారీ దెబ్బ

**ములుగు, జూన్ 05(ప్రజాక్షేత్రం):**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులకు పోలీసులకు భీకర ఎదురు కాల్పులు జరిగాయి. గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఇరు వర్గాల మధ్య కాల్పులు కొనసాగాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత లక్ష్మీనరసింహ అలియాస్ సుధాకర్ మృతి చెందినట్లుగా తెలుస్తోంది. ఈయన 30 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నాడు. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్టుల కోసం కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది.

**మూడు నెలల్లో ముగ్గురు**

మూడు నెలల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో ముగ్గురు మావోయిస్టు అగ్రనేతలు మృతి చెందారు. వరుసగా కేంద్ర కమిటీకి చెందిన అగ్ర నేతలు మృతి చెందడం మావోయిస్టు పార్టీకి భారీ దెబ్బ తగిలినట్లయింది. ఆపరేషన్ కగార్ చేపట్టిన కేంద్ర ప్రభుత్వం అనుకున్నట్టుగానే తమ లక్ష్యాన్ని 2026 మార్చి 31 వరకు పూర్తి చేస్తుందా అంటే జరుగుతున్న పరిణామాలను బట్టి నిజమేనని అర్థమవుతున్నది. సుధాకర్ మృతిని భద్రతా బలగాలకు సంబంధించిన ఉన్నతాధికారి ధ్రువీకరించారు.

**సుధాకర్ కోసం స్పెషల్ ఆపరేషన్**

గురువారం జరిగిన ఎదురు కాల్పులు సుధాకర్‌ను అంతం చేయడమే ధ్యేయంగా జరిగినట్టు సమాచారం. అతనితో పాటు మరికొంతమంది మావోయిస్టులు మృతి చెందినట్టు తెలుస్తోంది. ఆపరేషన్ కగార్ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఆరుసార్లు మావోయిస్టులు శాంతి చర్చల కోసం విజ్ఞప్తి చేశారు. కానీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పందించడం లేదు.

**కొనసాగుతున్న వేట**

మావోయిస్టులను పూర్తిస్థాయిలో మట్టుబెట్టడమే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ నిర్వహిస్తున్నారు. కేంద్ర కమిటీ మావోయిస్టు పార్టీలో ప్రముఖంగా పనిచేస్తున్న 18 మంది సభ్యులను హతమార్చడమే ధ్యేయంగా కేంద్ర బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నట్లుగా స్పష్టంగా తెలుస్తోంది. 18 మందిలో ఇప్పటికే ముగ్గురు కీలక నేతలు మృతి చెందారు. మిగిలిన 15 మందిని మట్టుబెట్టేందుకు బలగాలను రంగంలోకి దించినట్లుగా సమాచారం. కేంద్ర కమిటీలో పని చేసే ఈ 18 మంది మొదటి నుంచి మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.



**వెంటబడి హతమారుస్తున్న భద్రతా బలగాలు**

గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురు కాల్పులు జరుగుతూనే ఉన్నాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో ఆరు నెలలుగా మావోయిస్టులు ఒక్కొక్కరుగా హతమవుతున్నారు. భద్రతా బలగాలను పటిష్టంగా ఎదుర్కోలేక వివిధ ప్రాంతాల్లో షెల్టర్ తీసుకుంటూ ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల్లో సంచరిస్తున్నారు. గత నెలలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్లలో 27 మంది మృతి చెందగా అందులో అగ్రనేత నంబాల కేశవరావు చనిపోయాడు.

# స్వయం ఉపాధితో వ్యాపారవేత్తగా ఎదుగొచ్చు

**బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్**

**షాద్ నగర్ జూన్ 05(ప్రజాక్షేత్రం):** స్వయం ఉపాధితో వ్యాపారవేత్తగా ఎదగడంతో పాటు తోటి వారికి ఉపాధిని కల్పించేందుకు అవకాశాలు ఉంటాయని బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్ అన్నారు. గురువారం షాద్ నగర్ పట్టణంలోని శరణబసప్ప కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాండ్ కలెక్షన్ ఫుట్ వేర్, శ్రీ వెంకటరమణ మోటార్స్ సర్వీసింగ్ షాప్ లను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో మనం నిర్వహించే వృత్తిలో నైపుణ్యం, క్రమశిక్షణ ఉంటే మనం ఎంచుకున్న రంగంలో ఖచ్చితంగా రాణించగలమని అభిప్రాయపడ్డారు. ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో వ్యాపారవేత్తలుగా ఎదుగొవచ్చని చెప్పారు. బ్రాండ్ కలెక్షన్ ఫుట్ వేర్, శ్రీ వెంకటరమణ మోటార్ వర్క్ షాప్ లను ప్రారంభించడం సంతోషకరంగా ఉందని, నాణ్యమైన సేవలను అందించి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్, మాజీ కౌన్సిలర్ వెంకట్రాం రెడ్డి, మాజీ సర్పంచులు శ్రవణ్ పట్వారీ, రవి గౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# జూన్ లోనే మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ

**రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు మహేష్**



**షాద్ నగర్ జూన్ 05(ప్రజాక్షేత్రం):** రేషన్ కార్డ్ దారులకు జూన్ లోనే మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించిందని బిజెపి రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు ఒకేసారి మూడు నెలల బియ్యం ఇవ్వాలని నిర్ణయించిందని, వచ్చే వర్షాకాలంలో వర్షాలు వరదలకు బియ్యం రవాణా సరఫరాలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉండడంతో జూన్, జూలై, ఆగస్టు, నేలలకు సంబంధించిన బియ్యం కోటాను జూన్ మాసంలోనే పేదలకు జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు పంపిణి చేయాలని ఆదేశాలు ఇవ్వడం పట్ల బిజెపి రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఒక ప్రకటనలొ హర్షం వ్యక్తం చేశారు. భారతదేశంలో చిట్టచివరి గ్రామాన్ని సైతం అభివృద్ధి చేసేది పేద ప్రజల ఆకలి తీర్చేది నరేంద్ర మోడి కేంద్ర ప్రభుత్వమేనని పేద ప్రజలకు ఇబ్బంది కలగకూడదని రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఉచితంగా పంపిణీ చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కు మరియు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు.

# శ్రీ శ్రీ పోచమ్మ తల్లిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ

**ఆత్మకూర్ జూన్ 05(ప్రజాక్షేత్రం):**

ఆత్మకూరు పట్టణ కేంద్రంలో గురువారం రోజు శ్రీ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయాని దర్శించుకున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ వీరితోపాటు నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులు కే ప్రశాంత్ కుమార్ రెడ్డి మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు మాజీ మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవి కుమార్ యాదవ్ లక్ష్మీనారాయణ ఆలయ కమిటీ అధ్యక్షులు యంవి రామన్ హైస్కూల్ అధినేత మొగిలి శ్రీధర్ గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు సిఐ శివకుమార్ ఎస్సై నరేందర్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కేసులో సీజైన గంజాయి అమ్మకం..!

- గంజాయి కేసులో తాండూర్ ఎక్సైజ్ కానిస్టేబుల్
- తనిఖీల్లో పట్టుకున్న షాద్ నగర్ పోలీసులు
- 1.5 కిలోల గంజాయి పట్టివేత
- షాద్ నగర్ సిఐ విజయకుమార్ వెల్లడి

**షాద్ నగర్ జూన్ 05(ప్రజాక్షేత్రం):**

షాద్ నగర్ లో పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తున్న సమయంలో ఓ యువకుడిని అదుపులోకి తీసుకోగా అతని వద్ద కిలోన్నర గంజాయి లభించింది.. తీగ లాగితే డొంక కదిలినట్టు తాండూరు ఎక్సైజ్ కార్యాలయంలో సీజ్ అయిన గంజాయిని బయటికి తీసి ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ దీనిని తన బంధువు ద్వారా విక్రయించేతువు తీసుకు వెళుతుండగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంచలన సంఘటన వివరాలను షాద్ నగర్ పట్టణ సిఐ విజయ్ కుమార్ గురువారం ఈ కేసుకు సంబంధించిన విషయాలు మీడియాకు వెల్లడించారు. ఈనెల 4వ తేదీన పట్టణంలోని ఫరూక్ నగర్ యాదవ కాలనీ ఈద్గా వద్ద స్థానిక ఎస్సై దేవరాజ్ వాహనాల తనకి చేస్తుండగా అంజద్ (32) అనే యువకుడు చేతిలో కవర్ తీసుకొని అనుమానాస్పదంగా వెళుతుండగా పోలీసులు అతని వద్ద సోదా చేశారు. చేతి కవర్ లో గంజాయి వాసనను పసిగట్టి ఎస్సై దేవరాజ్ తదితర సిబ్బంది అతని అదుపులోకి తీసుకున్నారనీ సిఐ విజయ్ కుమార్ వెల్లడించారు.






# పెరకపల్లేలో ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

- పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు మహా అన్న ప్రసాదం ఏర్పాటు
- పోచమ్మ ఆలయం నిర్మాణంతో పాటు విగ్రహ ప్రతిష్టతో గ్రామస్తుల్లో సంతోషం



**సైదాపూర్ జూన్ 05(ప్రజాక్షేత్రం):** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం పెరుకపల్లి గ్రామంలో గురువారం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి అర్చకులు పాలకుర్తి సుబ్రహ్మణ్య శర్మ ఉదయం నుండి ఆలయం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు మధ్య పోచమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పోచమ్మ తల్లి ఆలయం నిర్మించి విగ్రహ ప్రతిష్ట చేయడంతో గ్రామస్తుల్లో సంతోషం నెలకొంది. అనంతరం పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు మహాఅన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోతరాజు శ్రీనివాస్, ముత్యాల మల్లేష్ యాదవ్, ప్రముఖ డాక్టర్ పోతరాజు శ్రీనివాస్, పోతరాజు సుధాకర్, లచ్చయ్య, పోతరాజు ఎర్ర కర్ణాకర్, మల్లేశం, వేణు, వేణుగోపాల్, శ్రీనివాస్, లచ్చయ్య, కరుణాకర్, కనకయ్య, జక్కోజ్ కుమార్, నాగభూషణం, కానుగంటి బిక్షపతి, లక్కర్సు బుచ్చయ్య, కుమారస్వామి, పాపయ్య, రామ్మూర్తి, సుదర్శన చారి, తిప్పని పోతరాజు, సదాశివ దేవయ్య, కరుణాకర్, రమేష్, అనిల్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రం ను తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి

**బంగారుపాళ్యం జూన్ 05(ప్రజాక్షేత్రం):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారు పాలెం మండలంలోని గుండ్ల కట్టమంచి అంగన్వాడి కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి బంగారుపాలెం మండల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధారాణి ఆకస్మిక తనిఖీ చేశారు అంగన్వాడీ కేంద్రంలో హాజరు పట్టిని పరిశీలించి ఇందులో పిల్లల బరువు ఎత్తును యాదృచ్ఛికంగా, స్వయంగా, ప్రతి పిల్లలను ఎత్తుకొని బరువును పరిశీలించి హాజరు పట్టికలో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో తుంబ కుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్ రాయన్, ఎన్ఆర్హెచ్ఎం కోఆర్డినేటర్ రామ్మోహన్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ, డి పి హెచ్ ఎం ఓ డాక్టర్ అనూష, తుంబ కుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎం పి హెచ్ ఈ ఓ రమేష్, సూపర్వైజర్ హరి, అంగన్వాడి సూపర్వైజర్, ఆరోగ్య కార్యకర్త మోతిలాల్, హెల్త్ అసిస్టెంట్ శరత్, ఎమ్మెల్ హెచ్పి పునీత్, అనూష తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్ సాక్షిగా ప్రేమ జంట పై దాడి!

**వరంగల్ జిల్లా జూన్ 05(ప్రజాక్షేత్రం):**

పోలీస్ స్టేషన్ ఆవరణలోనే ప్రేమ జంటపై దాడి జరిగింది. హనుమకొండ జిల్లాలోని నల్లబెల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రేమ పెళ్లి వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. హన్మకొండ జిల్లా శాయంపేట మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన నితీషా, శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పల్లె బోయిన మణిరాజ్, గత నెల 24న వడాల నితీషా ను ప్రేమ వివాహం చేసుకున్నాడు, పెళ్లి అనంతరం శనిగరంలోని తన చిన్నమ్మ ఇంట్లో వారు కొంత కాలం తలదాచుకు న్నారు. విషయం తెలుసుకున్న యువతి బంధువులు వారిపై దాడికి యత్నించా రు. దీంతో వారు అక్కడి నుంచి బయటపడి పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. నల్లబెల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలోనే యువతి బంధువులు యువకుడిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. యువకుడిపై పిడిగుద్దులతో దాడి చేసి యువతిని లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు యువతి బంధువులను అడ్డుకొని పలువురిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఆ తరువాత ప్రమ జంటకు పోలీసులు ఆశ్రయం కల్పించారు. నితీషను పోలీస్ స్టేషన్ లోకి తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. తను తన భర్తతోనే ఉంటానని పోలీసులకు నితీష తేల్చి చెప్పింది. దీంతో పోలీసులు నితీష తల్లిదండ్రులను, బంధువులను అక్కడి నుంచి పంపించేశారు.

## ఎమ్మెల్యే రేవూరి ని కలిసిన మండల ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

**పరకాల జూన్ 05(ప్రజాక్షేత్రం):** పరకాల మండల ఎరువులు పురుగుమందులు మరియు విత్తనముల డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ పరకాల అరుణ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ ప్రొప్రైటర్ గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పరకాల శాసన సభ్యులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ని హనుమకొండ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నూతన కమిటీ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ను ప్రధాన కార్యదర్శి నవత బ్రదర్స్ శివాజీని కోశాధికారి మల్లికార్జున ట్రేడర్స్ ఎర్ర లక్ష్మణ్ లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ... విత్తనాలు ఎరువులు పురుగు మందులు వ్యాపారులు నాణ్యమైన విత్తనాలు ఎరువులను రైతులకు అందించే విధంగా నాణ్యత ప్రమాణాలతో తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని స్థానిక ఎమ్మెల్యేగా నా సహాయ సహకారాలు మీకు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యాపారస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలి

**న్యాయవాది ఎర్రోళ్ల ఆనంద్ రావు**

**శంకర్ పల్లి జూన్ 05(ప్రజాక్షేత్రం):** ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలి. ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ పాటించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కాంగ్రెస్ నాయకులు న్యాయవాది ఎర్రోళ్ల ఆనంద్ రావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం శంకర్ పల్లి మున్సిపాలిటీ లోని సింగాపూర్ పర్యావరణ పరిరక్షణకు దినోత్సవం సందర్భంగా గ్రామ యువకులు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా స్వయంగా ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి మాట్లాడారు. పర్యావరణానికి ఇతోదీకంగా హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా వాటికి బదులుగా జ్యూట్ బ్యాగులను, స్టీలు గ్లాసులు, ప్లేట్లను మరియు ప్లాస్టిక్ ప్రత్యేకంగా పర్యావరణహితమైన వస్తువులనే నిజజీవితంలో వినియోగించి ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్ష



ణకు తమ వంతు కృషి చేయాలని అన్నారు. అదే విధంగా ప్రతి ఒక్క పౌరుడు విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎర్రోళ్ల శాంతి కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బూర్నింగని రాంచందర్, రుద్రారం సుదర్శన్, శేరిగూడెం వెంకటేష్, ఎర్రోళ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో భూ సమస్యలు పరిష్కారం

- భూములపై రైతులకు పూర్తి హక్కు కల్పించేందుకే భూభారతి
- ఇందుర్తి రెవెన్యూ సదస్సులో 277దరఖాస్తులు
- రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్న తహసిల్దార్ ముద్దసాని రమేష్

**చిగురుమామిడి జూన్ 05(ప్రజాక్షేత్రం):** భూ యజమానులు, రైతులు తమ భూమి రికార్డుల్లో ఏమైనా తప్పులు ఉన్న, అర్హత ఉండి రెవిన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు కాకపోయినా ఇతర భూ సమస్యలు ఉన్న అన్ని గ్రామాల్లో నిర్వహించే భూభారతి రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని చిగురుమామిడి తాహశీల్దార్ ముద్దసాని రమేష్ కోరారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులో తహసిల్దార్ మాట్లాడుతూ భూ భారతి చట్టంతో భూ సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయని, భూమి యజమానులకు పూర్తి హక్కులు కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేస్తుందని తాసిల్దార్ పేర్కొన్నారు.రెవెన్యూ సదస్సులో రైతులు దరఖాస్తు చేసుకున్న సమస్యపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిష్కరిస్తామని తెలిపారు. ఇందుర్తి రెవెన్యూ పరిధిలోని గాగిరెడ్డిపల్లె, ఓగులాపూర్, గునుకులపల్లె గ్రామాల్లోని భూ సమస్యలు ఉన్న రైతుల నుండి మొదటి రోజు 277దరఖాస్తులను స్వీకరించినట్లు తహసిల్దార్ వివరించారు. అనంతరం రైతులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కాంతాల రామ్ రెడ్డి, వెన్నం రాజిరెడ్డిలు మాట్లాడుతూ గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో భూ యజమానుల సమయం లేకుండానే భూములను ఇతర పేర్ల మీద మార్చారని, దీంతో బాధిత రైతులు రెవెన్యూ కార్యాలయంలో చుట్టూ తిరుగుతూ మానసికంగా కృంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థలో నాడు చేసిన తప్పులతో రైతులు ఇబ్బంది పడవద్దు అనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభు



త్వం భూ భారతి చట్టాన్ని పక్కగా అమలు చేస్తుందని గడ్డం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.రైతుల వద్దకే వచ్చి రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని రైతులు ప్రజలు హర్షిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఓగులాపూర్ గ్రామానికి చెందిన బండి పోచవ్వ, చింతగట్టు ఐలవ్వ, నరసయ్య, జెల్లా శివాజీ, జెల్ల భవానిలు చాలా సంవత్సరాలుగా తమ భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని రెవెన్యూ సదస్సు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసిల్దార్ స్వరూప రాణి, ఆర్ఐలు అరుణ్ కుమార్, తారా దేవి, రెవిన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- సాగు చేసుకునే ప్రతీ రైతుకు హక్కులు కల్పించి పట్టాలిస్తాం..
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..

**భూపాల్ పల్లి జూన్ 05(ప్రజాక్షేత్రం):** రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో తహశీల్దార్ సత్యనారాయణ స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... సాగు చేసుకునే ప్రతి రైతుకు హక్కులు కల్పించి పట్టాలిస్తామన్నారు. రైతులు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో భూమికి పట్టాలు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఒక్క రూపాయి లంచం లేకుండా పారదర్శకంగా పట్టాలిచ్చే కార్యక్రమానికి ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఇచ్చిన ప్రతీ దరఖాస్తు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి పట్టాలు జారీ చేస్తామని తెలిపారు. ప్రజలు రెవెన్యూ సదస్సులలో తమ భూ సమస్యలపై దరఖాస్తు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## ఉద్యాన కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు. ప్లాస్టిక్ కాలుష్య నివారణకై పిలుపు

**పెద్దమందడి,జూన్ 05 (ప్రజాక్షేత్రం):** శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని మోజెర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య సారథ్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ సేవా పథకంలో భాగంగా యన్.యస్.యస్ ఆఫీసర్లు డా.జి. విద్య మరియు కె. భాస్కర్ పర్యవేక్షణలో "ప్లాస్టిక్ కాలుష్యాన్ని జయిద్దాం" అనే అంశాన్ని ప్రధానంగా తీసుకొని ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రొఫెసర్లు నీటి ఎద్దడిని తట్టుకొని ఎలాంటి వాతావరణంలో అయినా ఎదిగి కాపునిచ్చే కరోండా (వాక్కాయ) మొక్కలను నాటారు.ఈ మొక్కలు ప్రధానంగా జీవ కంచెగాను, పచ్చళ్ళకు ఉపయోగపడతాయి.అధిక సి విటమిన్ ,ఇనుము కూడా కలిగివుంటాయి అని ప్రొఫెసర్లు తెలిపారు.క్యాంపస్ లోని బాలుర,బాలికల వసతి గృహాల్లో మరియు కళాశాల అవరణలోని ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులు, ప్రొఫెసర్లు కలిసి పోగుచేసి వాటి కారణంగా జరిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. అనంతరం హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి వరకూ పర్యావరణ పరిరక్షణకు ప్లకార్డులు మరియు నినాదాలతో ర్యాలీని నిర్వహించారు.పర్యావరణ పరిరక్షణ మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.జె. శ్రీనివాస్,డా. గౌతమి,టీచింగ్ అసోసియేట్ డా .రవళి,నాన్ టీచింగ్ స్టాఫ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన జిల్లా మాజీ చైర్మన్ సందీప్ రెడ్డి

**వలిగొండ,జూన్ 05(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన గంగాపురం బాలరాజు కుమార్తె మానస, మహేష్ గౌడ్ వివాహానికి విచ్చేసిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వలిగొండ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాలి

- చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జడ్జి

**చేవెళ్ల జూన్ 05(ప్రజాక్షేత్రం):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య గారు తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా చేవెళ్ల కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు మొక్కలు నాటి భూతాపం తగ్గించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, సీనియర్ న్యాయవాదులు పాండురంగారెడ్డి,



బాలస్వామి, నర్సింలు, మరియు న్యాయవాదులు రాజశేఖర్, రామకృష్ణ, శివరాజ్, సిహెచ్ రవీందర్, బి ఆనంద్, గిరి, విఠల్, అభిలాష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.



## మొక్కల ద్వారా ప్రాణ వాయువు

**సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మమ్మద్ నియాజ్**

**సుల్తానాబాద్,జూన్ 05,(ప్రజాక్షేత్రం):** మొక్కల ద్వారా మానవాళికి ప్రాణవాయువు లభిస్తుందని సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ అన్నారు.గురువారం మున్సిపల్ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా వన మహోత్సవం ర్యాలీలో ప్లాకార్స్ ద్వారా నినాదాలు చేస్తూ మున్సిపల్ కార్యాలయం నుండి తెలంగాణ చౌరస్తా మీదుగా బస్టాండ్ పెద్ద చెరువు కట్ట నుండి ర్యాలీ కొనసాగింది. అనంతరం స్థానిక బస్టాండ్,చెరువు కట్ట వద్ద 200 ల మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,స్వచ్ఛత పై తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ విధిగా తమ గృహాల కాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి సంరక్షించాలని తద్వారా సకాలంలో వర్షాలు కురుస్తాయని చెట్ల ద్వారా ప్రాణవాయువు లభిస్తుందని వాతావరణంలో చక్కటి మార్పులు సైతం ఏర్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్,మెప్మా కోఆర్డినేటర్ స్వరూప,వార్డు ఆఫీసర్లు,ఆర్పీలు,మున్సిపల్ సిబ్బందితో తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటాలి... పర్యావరణాన్ని కాపాడాలి

**పెద్దపల్లి,జూన్ 05,(ప్రజాక్షేత్రం):**

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాలుష్యం నుండి కాపాడుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారులు స్పష్టం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నా ప్రసన్నకుమారి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు హెల్త్ వెల్ నెస్ సెంటర్ల యందు మొక్కలను నాటారు.ఆయా ఆసుపత్రిల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లను తొలగించారు.ప్లాస్టిక్ ను తప్పనిసరై వాడినచో వాటిని పునర్వినియోగానికి పంపాలి అని అన్నారు.ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకం వినియోగం వల్ల కలిగే వాతావరణ కాలుష్యం,తద్వారా జరిగే నష్టాలను ప్రజలకు వివ



రిస్తూ అవగాహన కల్పించారు.ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని కోరారు.పర్యావరణాన్ని కాపాడడానికి వారి వంతుగా సహాయం చేస్తానని వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ సూపర్వైజర్లు,ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
06.06.2025
శుక్రవారం | హైదరాబాద్

## కోర్టు ఆవరణలో ఖైదీ దారుణ హత్య?

**హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):** దేశ రాజధాని ఢిల్లీ లో ఈరోజు ఉదయం దారుణ ఘటన చోటు చేసుకుంది, ఢిల్లీలోని సాకేత్ కోర్టు ఆవరణలో ఓ ఖైదీని సహచార ఖైదీలు దారుణంగా గొంతు కోసి హత్య చేశారు. విచారణ కోసం తీహార్ జైలు నుంచి ఖైదీలను పోలీసులు కోర్టుకు తీసుకొచ్చారు అక్కడ లాకప్ లో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది ఈ ఘర్షణలో ఇద్దరు ఖైదీలు తోటి ఖైదీ పై దాడి చేసి గొంతు కోశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం....ఈ హత్య పాత కక్షలే ప్రధాన కారణమని పోలీసులు అనుమానిస్తు న్నారు. ఈ ఘటన జైలు శాఖ మరియు న్యాయ వ్యవస్థల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ఈ ఘర్షణలో అమన్ అనే ఖైదీ తీవ్రంగా గాయపడిన ట్లు చెప్పారు. అధికారులు వెంటనే అతన్ని సమీపం లోని ఆసుపత్రికి తరలించ గా అక్కడ మరణించినట్లు ప్రకటించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను విచారిస్తున్నారు. ఈ ఘటన జైలుశాఖ మరియు కోర్టు భద్రతా వ్యవస్థలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తాయి. ప్రస్తుతం, ఈ ఘటనలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.





## వధూవరులను ఆశీర్వదించి పెళ్ళి కానుక అందజేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి

**వలిగొండ,జూన్ 05(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని రెడ్ల రాపాక గ్రామానికి చెందిన సుక్క యాదమ్మ కుమార్తె శిరీష వివాహము లక్ష్మయ్య తో రామన్నపేట మండలం బోగారంలోని శ్రీ సాయిరాం ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది .ఈ వివాహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, ఆడపిల్ల కానుక ద్వారా వధువు కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నోముల మల్లేష్,సిరుకొండ జాంగిర్, కందుల శీను,సుక్కా యాదయ్య,లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## పామెన భీమ్ భారత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన డప్పు రవికుమార్ అజీజ్ నగర్ బిఎస్పి పార్టీ అధ్యక్షులు

**మొయినాబాద్,జూన్ 05(ప్రజాక్షేత్రం ):** మున్సిపాలిటీ వార్డు పరిధిలోని అజీజ్ నగర్ బిఎస్పి పార్టీ అధ్యక్షులు డప్పు రవికుమార్ చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జి పామెన భీమ్ భారత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం రవి కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదప్రజలకు చేస్తున్న మంచి పనులు చూసి రైతు రుణ మాఫీ,మహిళలకు అండగా ఫ్రీ బస్ సర్వీసులు,ఫ్రీ కరెంట్, ఇందిరమ్మ ఇల్లు ,ఇలా అనేక పథకాలు చూసి కాంగ్రెస్ పార్టీ అభిమానిగా మరి పార్టీ లో చేరానని తెలిపారు .ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త జైపాల్ రెడ్డి,అనుగు మహేందర్ రెడ్డి,గంటి నాగరాజు కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉప అధ్యక్షులు,అంతంగారి విజేందర్,దర్గా అశోక్, నరేందర్,వెంకటేష్, మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మలి మానెయ్య తదితరులు పాల్గొన్నారు.



## పీఎస్ లో యువకుడి మృతి: తెలంగాణ ప్రభుత్వానికి ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు

- రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో యువకుడి మృతి
- స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్
- తెలంగాణ ప్రభుత్వానికి, డీజీపీకి నోటీసులు జారీ
- పోలీసుల వేధింపులే మృతికి కారణమని మీడియా కథనాల ప్రస్తావన
- రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశం

**హైదరాబాద్, జూన్ 05(ప్రజాక్షేత్రం):** హైదరాబాద్ నగరంలోని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువకుడు మృతి చెందిన ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్సీ) తీవ్రంగా స్పందించింది. ఈ దురదృష్టకర సంఘటనకు సంబంధించి మీడియాలో వెలువడిన కథనాలను సుమోటోగా స్వీకరించిన కమిషన్, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పోలీసుల వేధింపుల కారణంగానే ఆ యువకుడు ప్రాణాలు కోల్పోయినట్లుగా పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌హెచ్ఆర్సీ, ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక అందజేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డీజీపీని ఆదేశించింది. ఈ నోటీసులకు రెండు వారాల్లోగా స్పందించి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, తీసుకున్న చర్యలపై వివరణ ఇవ్వాలని ఎన్‌హెచ్ఆర్సీ స్పష్టం చేసింది. యువకుడి మృతికి దారితీసిన పరిస్థితులు, పోలీసులపై వచ్చిన ఆరోపణలపైన లోతైన విచారణ జరిపి, వాస్తవాలను నివేదించాలని కోరింది.

## ప్రభుత్వ పాఠశాలలో అందే నాణ్యమైన విద్య పట్ల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలి

- బడిబాట కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం
- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి,జూన్ 05(ప్రజాక్షేత్రం):** ప్రభుత్వ పాఠశాలలో అందే నాణ్యమైన విద్య పట్ల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బడిబాట కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న 10 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు,7 ఆదర్శ పాఠశాలలు,361 ప్రాథమిక పాఠశాలలో,83 అప్పర్ ప్రైమరీ స్కూల్స్,104 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పరిధిలో విద్యా అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు.బడి బాట కార్యక్రమం ద్వారా జూన్ 6 నుంచి జూన్ 19 వరకు ప్రభుత్వ పరిధిలో నడిచే వివిధ రకాల విద్యా సంస్థలో పిల్లలను జాయిన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో బడి బాట కార్యక్రమం నిర్వహించాలని అన్నారు.గత సంవత్సరం బడిబాట కార్యక్రమం ద్వారా 2099 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారని కలెక్టర్ గుర్తు చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మొదటి రోజే పాఠ్య పుస్తకాలు,స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నామని తెలిపారు.10,186 మంది నిరక్షరాస్యులను ఉల్లాస్ కార్యక్రమం కింద రిజిస్ట్రేషన్ చేసి వారికి విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.3 నుంచి 14 సంవత్సరాలు వరకు వయసు ఉన్నవారు తప్పనిసరిగా పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకోవాలని,ఆరోగ్య కారణాల వల్ల తీసుకోలేని పక్షంలో ఓపెన్ టెన్త్ పరీక్షలు రాయించాలని అన్నారు.15 సంవత్సరాల వయసు ఉన్న వారిచే ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేరే పిల్లలకు నాణ్యమైన విద్య బోధన అందుతుందని, ప్రభుత్వం ఇటీవల ఖాళీలను సైతం భర్తీ చేసిందని, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా అవసరమైన మౌలిక వస్తువులు కల్పించామని, విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని అన్నారు.స్వశక్తి సహాయక సంఘాల సమావేశాల్లో కూడా బడిబాట గురించి చర్చించాలని కలెక్టర్ సూచించారు. జూన్ 12 న జరిగే సమావేశంలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు,పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని అన్నారు.పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గత సంవత్సరం హాజర శాతం అధికంగా ఉన్న విద్యార్థుల, మంచి ఫలితాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌ను పాఠశాల ప్రారంభం సందర్భంగా సన్మానించాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల లక్ష్యాలు తల్లిదండ్రులకు స్పష్టంగా తెలిసేలా ముందు రోజే తెలియజేయాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి,జడ్పీసిఓ నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య,జిసిడిఓ కవిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.









## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు

**రామంచ,జూన్ 05(ప్రజాక్షేత్రం):** రామంచ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎంపీఓ బండ రాజశేఖర్ రెడ్డి మరియు గ్రామ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ బాబు,కాంగ్రెస్ పార్టీగ్రామ శాఖ అధ్యక్షులు వంటకాల సంపత్ రెడ్డి ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు వెల్దండ వేణుగోపాల్, కాతతిరుపతి ,వర్గల ఐలయ్య, కొండ కనకయ్య,చెరుకు శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు దొబ్బల బిక్షపతి,పైస లచ్చయ్య,గట్టు శ్రీనివాస్,గట్టు బుచ్చయ్య, లబ్ధిదారు తాళ్లపల్లిస్వరూప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## సామాజిక సేవలో ఎస్ జీ ఎస్

**విశాఖపట్నం,జూన్ 05(ప్రజాక్షేత్రం):** ఎస్ జీ ఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,తమ సంస్థ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, (విశాఖపట్నం)బ్రాంచి వారు, నగరంలో ఉన్న వానప్రస్థ వృద్ధాశ్రమ వసతి లో ఉన్న నిరుపేద వృద్ధులకు,వృద్ధ మాతృమూర్తులకు, ఎస్ జీ ఎస్ ఇండియా వారు( CSR) కార్పొరేట్ సామాజిక బాధ్యత తో నెలరోజులకు సరిపడే నిత్యావసర వస్తువులు,పండ్లు,ఆశ్రమ నిర్వాహకులు శ్రీ శ్రీనివాస కి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ జీ ఎస్ ఇండియా డైరెక్టర్ మెహర్,బ్రాంచి మేనేజర్ హైగ్రీవ రావు,ల్యాబ్ మేనేజర్ నరేంద్ర,పట్టాభి,శ్రీవాత్సవ్ , శ్రీనివాస్,రామారావు ,ఉమా మహేష్,గౌరవ్,నాయుడు, నరేష్,రమేష్, సహఉద్యోగులు,ఆనంద్, శ్రీనివాసరావు,రాంకుమార్, వెంకటరావు,వీర్రాజు, నరేష్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ సేవలు అభినందనీయం

**మాజీ మంత్రి,రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్.**

**రాజాం,జూన్ 05(ప్రజాక్షేత్రం):** ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాంక్షించి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ మంత్రి,రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం రాజాం పార్టీ కార్యాలయంలో యూజేఎఫ్ హ్యాండ్ బుక్ ను అయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా యూజేఎఫ్ విజయనగరం జిల్లా కన్వీనర్ మజ్జి. గణపతి రావు మాట్లాడుతూ జర్నలిస్టులు సామాజిక దృక్పథం తో సేవలందించాలనే సంకల్పం తో ఆవిర్భవించిన యూజేఎఫ్ అధ్యక్షులు డాక్టర్ ఎం.ఆర్.ఎన్.వర్మ ఆధ్వర్యంలో గత దశాబ్ద కాలానికి పైగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భీంపల్లి.తిరుపతిరావు, సీనియర్ జర్నలిస్ట్,యు. శశిభూషణరావు,సీనియర్ జర్నలిస్ట్,న్యాయవాది శాసపు.రమేష్,జర్నలిస్టులు ముగడు జగదీష్ ,సురేష్ జర్నలిస్టులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా దోస్వాడ రామచంద్రయ్య 25 గజాల భూమి ని తెలియకుండా మింగేసిన తిమింగలం.

**25 గజాల భూమి నాది అని అడిగితే వీరంగం సృష్టించిన పోతురాజుల విన్యాసం**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 5(ప్రజాక్షేత్రం):** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో పట్టాదారుకు తెలియకుండా 25 గజాల భూమిని వేరే వ్యక్తులకు అమ్మేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది, దోస్వాడ, జంగయ్య దోసవాడ బుగ్గయ్య, దోస్వాడ దుర్గయ్య, వీరు ముగ్గురు అన్నదమ్ములు, అయితే మీరు సంపాదించి పెట్టిన భూమి 150 గజాలు, దోస వాడు జంగయ్య మనుమడు, దోసవాడ రాజు తనకు 50 గజాల వాటా ఉన్నప్పటికీ, వెంకటయ్య పరిస్థితి బాగాలేక 25 గజాలు రాజుకు అమ్మేశాడు, మొత్తం కలిపి 75 గజాలు, వెంకటయ్య అన్న రామచంద్రయ్యకు, 25 గజాల భూమి ఉంటుంది, ఇట్టి భూమిని దోసడ రామచంద్రయ్య తెలవకుండా అక్కముల జంగయ్య కు దోసాడ రాజు అమ్మినట్లు సమాచారం, ఈ తతంగం జరుగుతున్నప్పటికీ దోస్వాడ వెంకటయ్య, అట్టి ప్లాట్ దగ్గరికి వెళ్ళగా పెంటయ్య ప్లాటు కూడా కబ్జా చేశారు. ఈ విజయం పై షాబాద్ తహసీల్దారుకు ఫిర్యాదు చేయగా త్వరలోనే ఎంక్వయిరీ చేయించి న్యాయం నేను చేస్తానని హామీ ఇచ్చారు. దోసవాడ పెంటయ్య భార్య కమలమ్మ అనారోగ్యంతో ఉన్నప్పటికీ కారులో తీసుకెళ్లి సంతకం పెట్టి 50 వేల రూపాయలు మాత్రమే ఇచ్చి వెళ్లిపోయారు.? దోసవాడ పెంటయ్య భార్య దోచాడ కమలమ్మ నుండి అనారోగ్యంతో బాధ పడుతుంది కనులు కనబడవు, ఇదే అనుమనుకొని దోసాడ రాజు, అక్కముల జంగయ్య, మరికొంత మంది కలిసి కమలమ్మని కార్లు ఎక్కించుకొని చేవెళ్లలో అడ్వకేట్ దగ్గర సంతకం 50 వేల ఇవ్వడంతో కమలం భర్త పెంటయ్య ఆశ్చర్యపోయాడు, ఇదేంది నేను లేని సమయంలో నా భార్యను కారులో తీసుకెళ్లి రాజు అక్కముల జంగయ్య మరికొంతమంది అనుచరులు తీసుకుపోవడం సంతకాలు పెట్టించడం ఇది సరైన పద్ధతి కాదని ఆయన తీవ్రంగా మండిపడుతున్నాడు, గత కొన్ని సంవత్సరాల నుండి ఇట్టి భూములను కాపాడుకుంటూ వచ్చినప్పటికీ నాకు తెలియకుండానే నా భార్యను తీసుకెళ్లి సంతకం పెట్టించి 50 వేల రూపాయలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం కాదని త్వరలోనే జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తారని ఆయన పేర్కొన్నారు ఒక రోగిని తీసుకెళ్లి అలా సంతకాలు చేసి 50 వేల రూపాయలు చేతిలో పెట్టడం ఈ అహంకారం దారులు చేసిన పనికి తగిన బుద్ధి చెప్పాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని అటు ప్రభుత్వాధికారులపై ఉందని తాళ్లపై తాళ్లపల్లి ప్రజలు ముక్కుపై వేలుసుకుంటున్నారు. దోసాడు కమలం మా తండ్రి దుర్గయ్య 80 గజాల భూమిని స్వాధీన పరిచినందుకు తామర తమ భూమి కావాలంటూ కమలమ్మ భర్త పెంటయ్య ఆరోపణ? 1993లో పేద ప్రజలకు అప్పటి కలెక్టర్, పేద ప్రజలకు ఈ ఇల్లు కట్టుకోవడానికి పట్టా సర్టిఫికెట్లు కేటాయించారు. అట్టి సర్టిఫికెట్ లో దోసడు దుర్గయ్యకు 80 గజాల భూమి కేటాయించింది, ప్రస్తుతం దౌర్జన్యంగా దోచాడ రాజు అట్టి 80 గజాల భూమిని తమకు ఇవ్వాలని దుర్గయ్య అల్లుడు పెంటయ్య డిమాండ్ చేస్తున్నాడు, అట్టి భూమి ఒకవేళ రాజు ఇవ్వకపోతే చేవెళ్ల ఆర్డీవోకు దరఖాస్తు చేస్తామని పెంటయ్య దిమో వ్యక్తం చేస్తున్నారు లేనిచ త్వరలోనే కలెక్టర్ ఫిర్యాదు చేసి మా మామగారి పేరును ఉన్నటువంటి 80 గజాల భూమిని లాక్కుంటామని పెంటయ్య ధీమా వ్యక్తం చేశాడు

## మొక్కలు నాటాలి... పర్యావరణాన్ని కాపాడాలి

**శ్రీహరిపురం,జూన్ 05(ప్రజాక్షేత్రం):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భం గా శ్రీహరిపురం మండలం బిజెపి కుటుంబ సభ్యులందరూ కలిసి పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమానికి శ్రీహరిపురం మండలం బీజేపీ అధ్యక్షులు తెప్పల సతీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటి పర్యావరణ కాపాడుకోవాలని కోరుకుంటూ అలాగే ప్లాస్టిక్ వాడకం నియంత్రణలో అందరూ భాగస్వాములై మన పర్యావరణాన్ని కాపాడవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీహరిపురం మండలం ప్రధాన కార్యదర్శి కే వసుంధర,శ్రీహరిపురం మండలం ప్రధాన కార్యదర్శి పంచదారల రాజేష్ గారు మండల ఉపాధ్యక్షులు కర్రీ రామకృష్ణ శ్రీహరిపురం బీజేపీ సీనియర్ నాయకులు పంచదార అప్పలరాజు గారు, సీనియర్ నాయకులు బీడీ రాములు గారు అలాగే 60,61వార్డ్ బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైతు మహోత్సవం కార్యక్రమం

**చిగురుమామిడి,జూన్ 05(ప్రజాక్షేత్రం):** చిగురుమామిడి మండలంలోని రైతు సోదరులకు తెలియజేయునది ఏమనగా 06.06.2025 (శుక్రవారం) రోజున ఉదయం 10 గంటలకు రైతు మహోత్సవం కార్యక్రమం వ్యవసాయ మార్కెట్ కమిటీ హుస్నాబాద్ వద్ద నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వర రావు గారు మరియు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ మంత్రి వర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గౌడ్ గారు, వ్యవసాయ మరియు అనుబంధ శాఖల శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొంటారు. కావున రైతు సోదరులు, ప్రజాప్రతినిధులు మరియు పత్రికా విలేఖర్లు అధిక సంఖ్యలో పాల్గొవలసిందిగా కోరడమైనది. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రత్యేకంగా బస్సు సదుపాయం కల్పించడం జరిగింది. వివరాల కొరకు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించవచ్చు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరుతున్నట్లు చిగురుమామిడి వ్యవసాయ శాఖ వారు తెలిపారు






## మున్సిపల్ ఎన్నికలకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధం

- **వార్డుల విభజనకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల**
- **రాష్ట్ర వ్యాప్తంగా 18 కొత్త మున్సిపాలిటీలు**
- **5 కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు**
- **7 మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలు విలీనం**

**హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):**

మున్సిపల్ ఎన్నికలకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. కొత్త మున్సిపాలిటీలలో వార్డుల విభజనకు కసరత్తు చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వార్డుల విభజనకు సంబంధించి నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 18 కొత్త మున్సిపాలిటీలు, 5 కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నాయి. 7 మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలు విలీనం అయ్యాయి. కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో వార్డుల విభజన ప్రక్రియకు మున్సిపల్ శాఖ అధికారి శ్రీదేవి షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 21 వరకు వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులను ఆదేశించారు

**త్వరలో రిజర్వేషన్‌లు ఖరారు..**

ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో, పంచాయతీల్లో వార్డుల విభజన, ఓటరు జాబితాను తయారు చేసింది. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను సిద్ధం చేసి ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. త్వరలో ఎన్నికలకు అవసరమైన రిజర్వేషన్లు ఖరారు చేయనున్నట్లు తెలియవచ్చింది. ఈ నేపథ్యంలో పట్టణాల్లోనూ వార్డుల విభజన చేపట్టడంతో ఆ తర్వాత ఓటరు జాబితా పూర్తి కానుంది. అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. పంచాయతీ, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తి కాగానే పట్టణ స్థానిక సంస్థల మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరగనున్నాయి.

**పునర్విభజన ఇలా..**

కోహిర్, కేసముద్రం, అశ్వరావుపేట, స్టేషన్ ఘనపూర్, మద్దూర్, ఎదులాపురం, దేవరకద్ర, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, చేవెళ్ల, మొయినాబాద్, ములుగు, బిచ్కుంద, కల్లూరు, అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో వార్డుల విభజన జరగనుంది. మహబూబ్ నగర్, మంచిర్యాల, కరీంనగర్, రామగుండం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లు, నర్సంపేట, పరిగి, కొల్లాపూర్, ఆలేరు, బాన్సువాడ, జగిత్యాల, హాలియా మున్సిపాలిటీల్లో విలీనమైన ప్రాంతాల్లోనూ కొత్త వార్డులు ఏర్పాటు కానున్నాయి. కొత్త మున్సిపాలిటీల్లో వార్డుల విభజన తర్వాత జూన్ నెలాఖరు వరకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని భావిస్తోంది.

## జనహృదయనేత సుక్క స్వామి జన్మదిన సందర్భంగా సన్మానించిన ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి



**నారాయణపురం జూన్ 05(ప్రజాక్షేత్రం):** మండలంలోని సర్వేలు గ్రామం చెందిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జనహృదయనేత సుక్క స్వామి జన్మదిన వేడుకల సందర్భంగా మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ని కలిసి జన్మదిన వేడుకలు నిర్వహణలో భాగంగా రాజ్ గోపాల్ రెడ్డి సుక్క స్వామి కి ఘనంగా శాలువలతో మరియు పుష్పగుచ్చాలతో సన్మానించడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ చదువు సంస్కారాన్ని నేర్పుతుంది జన్మ విజ్ఞానం వైపు నడుపుతుంది జన్మించిన ప్రతి మానవుడు విజయ ఆశయం కోసం పని చేస్తేనే ప్రజలను మంచి గుర్తింపు మంచి స్థాయి మంచి విలువలను పొందుతారు. అదేవిధంగా ఉన్నత స్థాయి శిఖరాలకు ఎదిగి గ్రామానికి కనిపించిన తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని సుఖసంతోషాలతో ఆనందంగా గడుపుతూ పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాన్ని చేసినట్లయితే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి:కలెక్టర్

**కామారెడ్డి,జూన్ 05 (ప్రజాక్షేత్రం):** ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ పాటించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ కామారెడ్డి మున్సిపాలిటీ లోని సిఎస్ఐ చర్చి గ్రౌండ్ లో వారసంత నిర్వహించిన ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు,ప్లాస్టిక్ వాడడం నియంత్రణపై నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి మాట్లాడారు. పర్యావరణానికి ఇతోదీకంగా హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా వాటికి బదులుగా జ్యూట్ బ్యాగులను,స్టీలు గ్లాసులు, ప్లేట్లను మరియు ప్లాస్టిక్ ప్రత్యేకంగా పర్యావరణహితమైన వస్తువులనే నిజజీవితంలో వినియోగించి ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని అన్నారు.అదేవిధంగా ప్రతి ఒక్క పౌరుడు విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి మరియు జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్,మెప్మా పీడీ శ్రీధర్, డిఎస్ఓ సిద్ధిరాంరెడ్డి, మున్సిపల్ డి ఈ వేణుగోపాల్, టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్ కుమార్,ఏఇలు,శానిటరీ ఇన్స్పెక్టర్లు,మున్సిపల్ మరియు మెప్మా సిబ్బంది, మున్సిపల్ వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# మహిళలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకే ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్ లు

**పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణారావు**

**పెద్దపల్లి,జూన్ 05(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో మహిళలను అన్నిరంగాల్లో తీర్చిదిద్దేందుకే ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ లు ఏర్పాటు చేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి గ్రూపుకి కేటాయించిన క్యాంటిన్ ను స్థానిక నాయకులతో,ఆసుపత్రి అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఆసుపత్రి కి వచ్చి వెళ్లే ప్రజల కోసం, రోగుల కోసం ప్రభుత్వ ప్రోత్సహంతొని ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతొని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటిన్ ను ప్రారంభించుకోవడం జరిగింది.మహిళలకు జీవనోపాధి కల్పించడంకోసం రాష్ట్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుంది.మహిళా గ్రూపుల ద్వారా మహిళలకు సేవా చేసే అవకాశం రావడం చాలా గర్వకారణం అందరి సహకారంతో ఈ మహిళా క్యాంటిన్ ముందు ముందు కూడా మంచి పురోగతి సాధించాలని ఎమ్మెల్యే కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప,ఆసుపత్రి జిల్లా సూపరింటెండెంట్ శ్రీధర్,డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్మెంట్ ఆఫీసర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ..!

- **దంపతులు మృతి.. చిన్నారికి తీవ్ర గాయాలు**
- **చిన్నారి చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలింపు**



సుల్తానాబాద్, జూన్ 05(ప్రజాక్షేత్రం):ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో దంపతులు మృతి చెందిన సంఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి స్టేజి వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మాదిగల ఆత్మగౌరవ ప్రతీక పద్మశ్రీ అవార్డు

**ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి మంథని సామెల్ మాదిగ**

**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 05 (ప్రజాక్షేత్రం):** మాదిగల ఆత్మగౌరవ ప్రతీక పద్మశ్రీ అవార్డు లభించిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి మంథని సామెల్ మాదిగ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోడ్డు భవనాల అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం కృషితో పాటు ఎమ్మార్పీఎస్ ప్రతి కార్యకర్త కృషి వల్లనే పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ కు పద్మశ్రీ అవార్డు లభించిందని అన్నారు. జిల్లాలో ఎమ్మార్పీఎస్ ను బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకోవాలని సూచించారు. ప్రతి మండల అధ్యక్షుడు గ్రామాలలో కార్యవర్గాలను బలోపేతం చేసే విధంగా చూడాలని అందుకుగాను నియోజకవర్గానికి ఒక ఇన్చార్జిని నియమించుకునే విధంగా సీనియర్ నాయకులు పాత్ర వహించాలని అన్నారు. త్వరలో జిల్లాలోని అన్ని మండలాలలో తిరిగి ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని అందుకు సీనియర్ జూనియర్ నాయకులు అందరూ కలిసికట్టుగా ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బట్టు వెంకటరాములు, భూపతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సట్టిగారి లక్ష్మి, యాదగిరి, లావణ్య, సాయిలు, బాలమణి, జర్నలిస్టు ఫోరం నాయకులు కుంటోళ్ళ యాదగిరి, రాజు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మనం వనం కర్యూరంలో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

**ఏలూరు జిల్లా జూన్ 05(ప్రజాక్షేత్రం):**

ఏలూరు జిల్లా చింతలపూడి మండలం చింతలపూడి నగర పంచాయతీలో ఈరోజు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్ లో చింతలపూడి నగర కమిషనర్ రాంబాబు ఆధ్వర్యంలో మనం మనం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు కుమార్ హాజరై కూటమి నాయకులతో కలసి మొక్కలు నాటారు ఈ సందర్భంగా శాసనసభ్యులు రోషన్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత గా సీఎం నారా చంద్రబాబు నాయుడు మానస పుత్రిక అయిన వనం మనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి టిడిపి టౌన్ అధ్యక్షులు తాటి అప్పారావు జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధు బిజెపి టౌన్ అధ్యక్షులు కొత్తపల్లి విజయ ఐ టి డి పి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్ జిల్లా రైతు కార్యదర్శి కొత్తపుడి శేషగిరిరావు మాజీ సర్పంచ్ చిట్లూర్ ధర్మరాజు కంచర్ల అబ్రహం దూదిగం ఉసి రమేష్ నత్త రవి కొనకల సతీష్ బోడ సాగర్ చిట్లూరి రాజా సుభాని మన్యం సత్యబాబు ఖమ్మం రమేష్ సంఘ విశ్వాసం జనసేన నాయకులు ఆకుల మధు పోతుల శ్రీను సునీత గుంశావళి జైపాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





## బాపట్ల లో ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం.

**బాపట్ల,జూన్ 05(ప్రజాక్షేత్రం):** బాపట్ల సూర్య లంక నగరవనంలో గురువారంమొక్కలు నాటిన బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ జె.వెంకటమురళి పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర మాట్లాడుతూ. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.భవిష్యత్తు తరాల కొరకు పర్యావరణాన్ని కాపాడుకోవాలని,ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో పర్యావరణానికి ముప్పు ఉందని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ రహిత వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం ,ఆర్.డి.ఓ పి. గ్లోరియా,బాపట్ల మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి,తహసీల్దార్ . షేక్ సలీమా,అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల అభివృద్ధి ఎక్కడ.. మెడికల్ కాలేజ్ నిర్మాణం ఎప్పుడు..

**మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి**

**బాపట్ల,జూన్05( ప్రజా క్షేత్రం):** మెడికల కాలేజ్ నిర్మాణం పై స్థానిక శాసనసభ్యుడు దృష్టి పెట్టాలి కదా అవసరమైతే ముఖ్యమంత్రి వద్దకు వివిధ పార్టీ నాయకులను తీసుకుని వెళ్లి అడగాలి అన్నారు.విద్యను,వైద్యాన్ని వ్యాపారంగా మార్చే చంద్రబాబు అంత, తెలివితేటలు మా జగన్మోహన్ రెడ్డి గారీ వద్ద లేవుఅని తెలియపరిచారు. తెనాలిలో అక్కడ దళిత యువకులను పోలీసులు అలా కొట్టడం దారుణం,కోర్టులు ఉంది దేనికి, చట్టాన్ని వీరే చేతుల్లో తీసుకొని ఎవరిని భయపెట్టాలని చూస్తున్నారు.ఈ రెడ్ బుక్ రాజ్యాంగంలో మా పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి తెనాలి వెళ్తే విమర్శించే వారు ఒంగోలులో నేర చరిత్ర ఉన్న టిడిపి నాయకుడు చనిపోతే ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు వెళ్లి పరామర్శించడం తప్పు కాదా.చనిపోయిన టిడిపి నేత మీద క్లిక్ చిట ఉందా నేర చరిత్ర కదా ఉంది.మా వైసీపీ ప్రభుత్వంలో 64 లక్షల పెన్షన్లు ఇస్తే ఈనెల కూటమి ప్రభుత్వం 61 లక్షల పెన్షన్లు మాత్రమే ఇచ్చింది అన్నారు. స్థానిక శాసనసభ్యుడు ఒక రోడ్డు వేసి ఆర్భాటాలు బడాయి తప్ప మరొకటి లేదు.ఈ కూటమి ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో ప్రజలకు ఇస్తానని ఇవ్వలేని సంక్షేమ పథకాలు,రాబోయే సంవత్సర కాలంలో వీటితో కలిపి ఇవ్వాలని చెబుతున్నాం. లేకపోతే ప్రజలు తిరగబడి ఒక ఉద్యమం లాగా మీ మీదకి వస్తారు.అదేవిధంగా నిన్నటి వెన్నుపోటు దినం కార్యక్రమానికి ప్రజలు అనుకున్న దాని కన్నా ఎక్కువ రావటం కూటమిపై ఉన్న వ్యతిరేకత కారణం అని రాష్ట్ర శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర కోన రఘుపతి అన్నారు.



## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మున్సిపల్ ఆర్ఐ

**నిర్మల్ జూన్ 05(ప్రజాక్షేత్రం):**



కొత్త ఇంటి నిర్మాణం కోసం అసెస్మెంట్ నెంబర్ కేటాయించడానికి సంబంధిత ఇంటి యజమాని నుండి డబ్బులు డిమాండ్ చేస్తూ ఎసిబికి దొరికిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పట్టణంలోని నిర్మల్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి షోయబులు ఇంటి నిర్మాణం కోసం యజమాని నుండి డబ్బులు డిమాండ్ చేయడంతో సదరు వ్యక్తి ఎసిబిని సంప్రదించడంతో వారిద్దరిని ఎసిబి డిఎస్పి విజయ్ కుమార్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో లంచం అడగడం నేరమని అన్నారు. అరెస్టు చేసిన ఇద్దరిని శుక్రవారం కరీంనగర్ కోర్టు హాజరుపరిస్తామని పేర్కొన్నారు.




## మెదుగు ఆకుల భోజనం ఆరోగ్యం ప్లాస్టిక్ వీస్తారు పాడవానికి హానికరం

**గంభీర్ పూర్ పంచాయతీ కార్యదర్శి చంద్రం**

**దుబ్బాక ప్రజాక్షేత్రం న్యూస్ జూన్ 5**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని గంభీర్ పూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలతో మోదుగు ఆకులతో విస్తర్లు తయారుచేసి ఆకుల యొక్క విశిష్టత తెలపడం జరిగినది...... ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ లో భోజనాలు చేస్తూ అనారోగ్యం పాలవుతూ ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధికి కారుకులవుతున్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు క్యాన్సర్ కు జయించాలంటే ప్లాస్టిక్ ను పూర్తిగా నిర్మించాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సంఘాల ప్రతినిధులు మహిళలు మరియు ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి చంద్రం తీసుకొని పోయి ఆనే కదుతుంది పాల్గొన్నారు.





## నూతన వధూవరులను ఆశీర్వదించిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**దుబ్బాక ప్రజాక్షేత్రం న్యూస్ జూన్ 5**

లక్ష్మి గార్డెన్ పెద్ద నిజాంపేట లో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బక్కన్నగారి మంజుల లింగం గౌడ్ కుమారుడు శ్రావణ్ గౌడ్ మనస్విని వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి మరియు వారితో పాటు దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, సీనియర్ నాయకులు తాడెం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు..

## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రిన్సిపల్ డాక్టర్ సునీత**



**సిద్దిపేట, జూన్ 5:** సిద్దిపేట జిల్లా మిట్టపల్లి గ్రామంలో గల సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో పలు గ్రూపులలో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత తెలిపారు. గురువారం ఆమె అడ్మిషన్ ప్రక్రియ వివరాలు వెల్లడించారు. 2025 విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ పాస్ అయిన మహిళా విద్యార్థులు డిగ్రీ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని సూచించారు. బీఎస్సీ (ఎంఎస్ సిఎస్), బీఎస్సీ (ఎంపీసీ/ ఎంపీసీఎస్), బీఎస్సీ (బిజెడ్ సి), బిఎస్సి (ఎంజెడ్ సి) బీకాం (సి ఏ), బీకాం (జనరల్), బిఏ (హెచ్ ఈపి) కోర్సులలో అడ్మిషన్ పొందే అవకాశం ఉందన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ మెమో, 2025 జనవరి తర్వాత పొందిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, 5 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ జిరాక్స్, ఇంటర్మీడియట్ టిసి ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు ఈనెల 23 చివరి తేదిగా వెల్లడించారు.

## విదేశీ పర్యటనను ముగించుకున్న పల్లా

**చేర్యాల, జూన్ 5 (ప్రజాక్షేత్రం)** బి ఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సంబరాలకు అమెరికా వెళ్లిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈరోజు తెలంగాణ రాష్ట్రానికి తిరిగి రావడం జరిగింది..పల్లా కి చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన BRSV రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గదరాజు చందు స్వాగతం పలికారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ కీర్తిని అమెరికా దేశంలో నలుమూలల వ్యాప్తి చెందించి ఈరోజు మన రాష్ట్రానికి రావడం సంతోషంగా ఉంది అన్నారు..గదరాజు చందు తో పాటు పలువురు నాయకులు పల్లా కి స్వాగతం పలికారు







## భూ భారతి చట్టం రైతుల పాలిట చుట్టం

- దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్.
- భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
- అక్బర్ పేట భూంపల్లి మండల తహశీల్దార్ మల్లికార్జున్ రెడ్డి.

**దుబ్బాక ప్రజాక్షేత్రం న్యూస్ జూన్ 5**

అక్బర్ పేట భూంపల్లి మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ మాట్లాడుతూ కొత్త ఆర్.ఓ.ఆర్ భూ భారతి 2025 చట్టం రైతుల పాలిట చుట్టం లాగా పనిచేస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టంలో అక్రమాలకు తావు తావు లేదని తెలిపారు. ఈ భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలు తీరుతాయని భావితరాలకు సమస్యలు రాకుండా ప్రతి రైతుకి సమస్య తీర్చే విధంగా భూభారతి చట్టాన్ని రూపొందించబడిందని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటస్వామి గౌడ్ తెలిపారు. అక్బర్ పేట భూంపల్లి మండల తహశీల్దార్ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.6వ తేదీన నగరం, బేగంపేట, 9వ తేదీన రామేశ్వరంపల్లి, భూంపల్లి, 10వ తేదీన చిన్ననిజాంపేట, 11వ తేదీన పోతారెడ్డిపేట, 12వ తేదీన బొప్పాపురం, 13వ తేదీన రుద్రారం,16వ తేదీన చౌదర్పల్లి, 17వ తేదీన మోతే, 18వ తేదీన జంగాపల్లి, 19వ తేదీన అల్మాస్పూర్, 20వ తేదీన వీరారెడ్డి పల్లి గ్రామాలలో గ్రామపంచాయతీల వద్ద భూభారతి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, కూడా వెల్లి డైరెక్టర్ వెలుపుల యాదగిరి ముదిరాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోపరి రమేష్, బోడోల్ల దేవరాజు, వెలుపుల నరసింహులు, గోపరి స్వామి, గౌడుగుపల్లి బిక్షపతి, గోపరి యాదగిరి మరియు పెద్ద ఎత్తున ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబి వలలో బిల్ కలెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్

**మేడ్చల్ జూన్ 05(ప్రజాక్షేత్రం):**

మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేట వార్డు కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రవన్ కుమార్‌లు రూ. 20 వేలు ఇంటి మ్యుటేషన్ కోసం లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్ గా గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసిబి డిఎస్పి ఆనంద్‌కుమార్ తూంకుంట మున్సిపాలిటీలో సోదాల అనంతరం ఆయన మాట్లాడుతూ ఓ యజమాని శామీర్‌పేటలో రెండు ఇండ్లను కొనుగోలు చేశాడు. ఆ ఇండ్లకు సంబంధించి మ్యుటేషన్ చేయించడానికి సంవత్సరం నుంచి కార్యాలయాల చుట్టు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శామీర్‌పేట వార్డు కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రవణ్ కుమార్ బాధితుడి ఇంటికి వెళ్లి మీ ఇంటి మ్యుటేషన్ పెండింగ్‌లో ఉన్నాయని రూ. 20 వేలు లంచం ఇస్తే మ్యుటేషన్ చేస్తామని ఇంటి యజమానికి చెప్పారు. నేను అంతగా ఇచ్చుకోలేను మ్యుటేషన్ చేయాలని కార్యాలయం చుట్టు తిరిగాడు. అయినా చేయకపోవడంతో విసుగుచెంది యజమాని లంచం ఇవ్వడం ఇష్టం లేక ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనలతో వారిని కలిశాడు. రూ.20 వేలు డబ్బులు లంచంగా ఇస్తుండగా శ్రవణ్ కుమార్ ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇంకా ఇందులో ఎవరి ప్రమేయం ఉందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఏసిబి డిఎస్పి ఆనంద్ కుమార్ తెలిపారు.





## ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

**ప్రజాక్షేత్రం గజ్వేల్ నియోజకవర్గం :**



రాయపోలు మండలం మాచిన్ పల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, గ్రామ పురోహితులు, నిర్వాహకులు మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందని, పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టా వేడుకలునిన్నటి నుండి మొదలుకొని ఆదివారం వరకు నిర్వహించడం జరుగుతుందని శుక్రవారం రోజున విగ్రహాన్ని ప్రతిష్ఠించి, భక్తులకు అన్నప్రసాదం అందజేయడం జరిగిందని అలాగే, అమ్మవారి కల్యాణం, వడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అమ్మ దయతో సకాలంలో వర్షాలు పడి సమృద్ధిగా పంటలు పండి పండిన పంటలకు గిట్టుబాటు ధర రావాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని అన్నారు, శుక్రవారం రోజున విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేయడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో చుట్టుపక్క గ్రామాల ప్రజలు అందరూ హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాచిన్ పల్లి గ్రామస్తులు, ముదిరాజ్ సంఘ సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## మాగంటి గోపీనాథ్ అస్వస్థతకు కారణమేంటో చెప్పిన దాసోజు శ్రవణ్

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు గుండె సంబంధిత సమస్య
- గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో ప్రస్తుతం చికిత్స
- ఆరోగ్యం మెరుగుపడుతోందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వెల్లడి
- బీఆర్ఎస్ నేత సర్దార్ ఆత్మహత్య ఘటనతో తీవ్ర ఒత్తిడికి గురైన ఎమ్మెల్యే
- పరామర్శించిన మాజీ మంత్రి హరీశ్ రావు, పలువురు బీఆర్ఎస్ నేతలు
- 48 గంటల తర్వాత వైద్యుల హెల్త్ బులెటిన్ విడుదల

**హైదరాబాద్ జూన్ 05(ప్రజాక్షేత్రం):** జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరడం తెలిసిందే. ప్రస్తుతం ఆయన గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో గుండె సంబంధిత సమస్యకు చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వెల్లడించారు. మాగంటి గోపీనాథ్ ఆరోగ్యం గురించి దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్యే వైద్యానికి స్పందిస్తున్నారని తెలిపారు. వైద్యులు ఆయనను 48 గంటల పాటు పర్యవేక్షణలో ఉంచాలని నిర్ణయించారని, ఆ తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితిపై అధికారికంగా హెల్త్ బులెటిన్ విడుదల చేస్తారని వివరించారు. ఇటీవల బోరబండ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకుడు మహ్మద్ సర్దార్ ఆత్మహత్య చేసుకున్నారని, ఈ ఘటనతో మాగంటి గోపీనాథ్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మీడియాకు తెలిపారు. మాగంటి గోపీనాథ్ ఆసుపత్రిలో ఉన్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, ముఠా గోపాల్ సహా పలువురు బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితరులు ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వారు గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సీనియర్ వైద్యుల బృందం ఆయనకు మెరుగైన చికిత్స అందిస్తోందని, ఆయన త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో క్షేమంగా బయటకు వస్తారనే విశ్వాసం తమకుందని దాసోజు శ్రవణ్ ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.







## విస్తరాకుల తయారిపై అవగాహన

**ప్రజాక్షేత్రం, సిద్దిపేట రూరల్:** జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా సిద్దిపేట జిల్లాలోని అన్ని పెద్దలింగారెడ్డిపల్లె గ్రామంలో విస్తరాకుల తయారు చేసి, పేపర్ ప్లేట్ల వల్ల కలిగే నష్టాలు తెలియజేస్తూ విస్తరాకుల వల్ల కలిగే లాభాలను తెలియజేయడం జరిగింది. పేపర్ ప్లేట్లలో ఒక లేయర్ గా ఉండే ప్లాస్టిక్ కవర్ వేడివేడి ఆహార పదార్థాలు వేసినప్పుడు కరిగిపోయి శరీరంలోకి వెళ్లి క్యాన్సర్ కార్యక్రమం మారుతుందని, ప్రకృతిలో లభించే మోదుగ ఆకులతో తయారు చేసిన విస్తరాకులలో భోజనాలు చేయడం వల్ల ఎటువంటి నష్టాలు ఉండవని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ కూలీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాగు బోతులకు జరిమాన

**ప్రజాక్షేత్రం, సిద్దిపేట అర్బన్:**

సిద్దిపేట ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 7 మందికి రూ. 16 వేల రూపాయల జరిమానా విధించారని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సిబ్బందితో కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా, 7 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేసి జరిమాన విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.



# గోల్డెన్ శారీలో మెరిసిపోయిన సామ్..

పలు అనారోగ్య కారణాలతో సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత.. ఇప్పుడిప్పుడే మళ్లీ ఫామ్‌లోకి వచ్చింది. వరుస ప్రాజెక్టులతో బిజీగా మారిపోయింది. వరుస పెట్టి సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చేస్తోంది. నిర్మాతగా మారి 'శుభం' మూవీ తో వచ్చిన ఈ అమ్మడు మొదటి చిత్రం తో మంచి హిట్ అందుకుంది. ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే మూవీ చేస్తోంది. అలాగే నెట్‌ఫ్లిక్స్‌లో 'రక్త్ బ్రహ్మండ్' అనే ప్రాజెక్ట్‌లోనూ భాగమైంది. అయితే ఈ మధ్య సామ్ మూవీస్ పరంగా మాత్రమే కాకుండా.. ఎక్కువగా ఈవెంట్స్‌లో పాల్గొంటూ సందడి చేస్తోంది.ఇందులో భాగంగా తాజాగా సమంత దుబాయ్‌లో జరిగిన ఓ స్పెషల్ ఈవెంట్‌కు చాలా స్పెషల్‌గా ముస్తాబై వచ్చింది. ఎంబ్రాయిడరీ నెట్ గోల్డ్ కలర్ శారీలో మెరిసిపోయింది. సింపుల్ మేకప్, హెయి స్టైల్‌తో తన లుక్‌కు మరింత అందంగా మార్చుకని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సామ్‌ను చూసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. వారందరితో సమంత ఫోటోలు, సెల్ఫీలకు ఫోజులిచ్చింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను సామ్ తన ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట తెగ ఆకట్టుకుంటున్నాయి. మొన్నటి వరకు జనాలోకి రావడానికి ఇబ్బంది పడిన సామ్ ఇలా అందరితో కలిసి పోతుంటే ఆమె అభిమానులు 'సామ్ ఎప్పటికీ ఇలాగే నవ్వుతూ ఉండాలి'

# గుడ్‌వైఫ్‌గా ప్రియమణి


భామా కలాపం, ది ఫ్యామిలీమ్యాన్ వంటి మంచి సక్సెస్ వెబ్‌సిరీస్‌లతో ప్రియమణి అందరినీ ఆకట్టుకుంది. ఆమె లీడ్ రోల్ చేస్తోందంటే ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఆ సిరీస్ కోసం వేచి చూస్తున్నారు. తాజాగా ఆమె తన న్యూ ప్రాజెక్ట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సిరీస్‌కు 'గుడ్ వైఫ్'గా పేరు పెట్టినట్లు చెప్పారు. అతి త్వరలో ఇది జియో హాస్టార్‌లో స్ట్రీమ్ కానుంది. దశాబ్దం క్రిందట అమెరికన్ టీవీల్లో వచ్చిన గుడ్ పైఫ్ అనే లీగల్ థ్రిల్లర్ అధారంగా తమిళంలో ఈ సిరీస్‌ను తెరకెక్కించి అదే పేరుతో ఇక్కడ ఓటీటీలోకి తీసుకు రాబోతున్నారు. సెక్స్ కుంభకోణంలో చిక్కుకున్న తన భర్తను రక్షించేందుకు ఓ మాజీ లాయర్ చేసిన పోరాటం నేపథ్యంలో అదిరిపోయే థ్రిల్లింగ్, ఎమోషనల్ డ్రామాగా ఉండనుంది. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో సైతం సంపత్ జైల్లో ఉండగా ప్రియమణి లాయర్ వేషధారణలో ఉన్న స్టిల్ పాత్ర తీరు తెన్నులను తెలియ జేస్తుంది. మరో వారంలో ఈ సిరీస్ టీజర్ రిలీజ్ చేయనున్నారు. కాగా ఈ సిరీస్‌ను తమిళంతో పాటు తెలుగు మరో 5 భాషల్లో విడుదల చేయనున్నారు.



# ఎస్ఎస్ఎంబీ-29 కొత్త షెడ్యూల్

దర్శకధీరుడు రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబోలో వస్తున్న సినిమా ఎస్ఎస్ఎంబీ 29. ఈ సినిమాకు ఇంకా పేరు ఫిక్స్ కాలేదు. షూటింగ్ మాత్రం శరవేగంగా జరుగుతోంది. ఇక షూట్ కూడా మొదలు పెట్టగా షూట్ గురించి అనేక వార్తలు తెరమీదకు వచ్చాయి. తాజాగా, సమ్మర్ వెకేషన్ అనంతరం ఈ సినిమా షూటింగ్ మరో కీలక షెడ్యూల్‌తో ప్రారంభం కానుందని సమాచారం. జూన్ 10, 2025 నుంచి వారాణసిలోని సెట్స్‌లో ఈ షెడ్యూల్ మొదలవనుందని తెలుస్తోంది. నిజానికి ఎస్ఎస్ఎంబీ 29 చిత్రీకరణ ఇప్పటికే ఒడిశాలోని కోరాపుట్‌లో జరిగిన షెడ్యూల్‌తో వార్తల్లో నిలిచింది. అక్కడ జరిగిన షూటింగ్‌లో మహేష్ బాబు, పృధ్వీరాజ్ సుకుమారన్‌లతో పాటు ప్రియాంక చోప్రా కూడా పాల్గొన్నారని వీడియో లీక్స్ తో క్లారిటీ వచ్చింది. ఇక ఇప్పుడు, సమ్మర్ వెకేషన్ తర్వాత, ఈ భారీ ప్రాజెక్ట్ వారాణసిలోని సెట్స్‌లో తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించనుంది. ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన మహేష్ బాబు లుక్స్ అందరినీ ఆకట్టుకున్నాయి.





# డిజాస్టర్ ఇచ్చిన డైరెక్టర్‌కు మాస్ మహారాజ్ మరో ఛాన్స్..!

సినిమా హిట్ ఫ్లాప్‌తోసంబంధం లేకుండా వరుస ప్రాజెక్టలతో దూసు కెళ్తున్న హీరో మాస్ మహారాజ్ రవితేజ. తాజాగా తన 76వ మూవీని సెట్స్‌పైకి తీసుకెళ్లడానికి రెడీ అయ్యాడు. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని నిర్మించిన ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి సమర్పణలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా ఈరోజు హైదరాబాద్‌లో గ్రాండ్‌గా పూజా కార్యక్రమంతో ప్రారంభం కానుంది. రవితేజ ట్రేడ్‌మార్క్ స్టైల్‌తో కూడిన హైఎనర్జీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందనుందని నిర్మాతలు ప్రకటించారు. సుధాకర్ చెరుకూరితో కలిసి రవితేజ రామారావు ఆన్ డ్యూటీ సినిమా చేశారు. ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర బొక్కబోర్లా పడింది. అంతటి డిజాస్టర్ ఇచ్చిన డైరెక్టర్‌కు మరో అవకాశం ఇవ్వాలని రవితేజ డిసైడ్ అయ్యాడు. మరి ఈ సినిమాతో రవితేజ కోరుకుంటున్న హిట్ అందుకుంటాడా? మాస్ హీరో కలను సుధాకర్ నెరవేరుస్తాడా? అనేది చూడాలి. ఇక ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్‌లు నటించనున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ, వారి పేర్లు ఇంకా అధికారికంగా ప్రకటించ



# రెమ్యూనరేషన్ తిరిగిచ్చేసిన పవర్ స్టార్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అప్‌కమింగ్ మూవీ హరిహర వీరమల్లు. ఈ సినిమా కోసం అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమా కోసం తీసుకున్న పారితోషికాన్ని పవన్ తిరిగి ఇచ్చేశారు. ఈ విషయాన్ని ఆయన అధికారికంగా ప్రకటించారు. 2020లో అధికారికంగా ఈ సినిమా మొదలు కాగా, సుదీర్ఘ కాలం సెట్స్‌పైనే ఉండిపోయింది. క్రిష్ దర్శకత్వంలో చాలా భాగం షూటింగ్ పూర్తి చేసుకుంది. పవన్‌కల్యాణ్ రాజకీయంగా బిజీ కావడంతో సినిమా మరింత ఆలస్యమవుతూ వచ్చింది. గతేడాది జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించడంతో పవన్ ఏపీ డిప్యూటీ సీఎం అయ్యారు. అప్పటి నుంచి ప్రజా సేవకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చారు. అలా మరికొన్ని నెలల పాటు షూటింగ్ వాయిదా పడింది. ఎట్టకేలకు ఇటీవలే ఏఎం రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వంలో చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. ఇన్నేళ్ల పాటు సినిమా సెట్స్‌పైనే ఉండటం, నిర్మాత ఏఎం రత్నంపై ఆర్థికంగా అదనపు భారం పడింది. ఈ విషయాలను తెలుసుకున్న పవన్‌కల్యాణ్ తాను అడ్వాన్స్‌గా తీసుకున్న పారితోషికం మొత్తాన్ని తిరిగి ఇచ్చేశారు. నిర్మాతల గురించి ఆలోచించే నటుల్లో పవన్ కల్యాణ్ ముందుంటారని మరోసారి నిరూపించారు.

# కమల్ దెబ్బ విజయ్‌కి తగిలిందా..?

కన్నడ భాషపై కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యల దెబ్బ తమిళ స్టార్ హీరో విజయ్‌కు తగిలింది. కమల్ వ్యాఖ్యల ప్రభావం వల్లే ఆయన తాజా సినిమా 'థగ్‌లైఫ్' విడుదలను కన్నడలో నిషేధించారు. ఈ వివాదంపై కన్నడ ఇండస్ట్రీ, కమల్ ఇరుపక్షాలు తగ్గేదేలా అన్నట్లు బిహేవ్ చేస్తున్నారు. థగ్‌లైఫ్ సినిమా విడుదల అనంతరం పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పుడు వచ్చే ఏడాది పొంగల్‌కు విజయ్ హీరోగా నటిస్తున్న 'జన నాయకన్'విడుదల కానుంది. ఇప్పుడున్న పరిస్థితుల నేపథ్యంలో 'జన నాయకన్'ను కూడా నిషేధించాలన్న టాక్ బలంగా వినిపిస్తోంది. ఈ సినిమాను నిర్మిస్తోంది బెంగళూరు కేంద్రంగా ఉన్న నిర్మాణ సంస్థ కెవిఎన్ ప్రొడక్షన్స్ కావడమే. థగ్ లైఫ్ సినిమాని కర్ణాటకలో నిషేధిస్తే, కన్నడ సినిమాలు తమిళనాడులో నిషేధించాలి. విజయ్ తన జననాయకన్ సినిమాని ఇక వదులుకోవాలి అంటూ ఎక్స్ వేదికగా రాజేష్ లింగేష్ అనే వ్యక్తి చేసిన ప్రకటనకు అనేక మంది మద్దతు తెలుపుతూ, జననాయకన్ కూడా బ్యాన్ చేయాలి అంటూ పోస్టులు చేస్తుండడం ఎక్కువైంది. తమిళ, కన్నడ, తెలుగు, హిందీ, మలయాళ భాషలలో విడుదల కానున్న జననాయకన్ సినిమాకు హెచ్ వినోద్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ పెట్టిన రాజకీయ పార్టీ తమిళక వెట్రి కజగం.. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్న పరిస్థితుల్లో... ఈ చిత్రం విడుదల, విజయం కూడా ఆ పార్టీకి చాలా కీలకం. దీంతో విజయ్ అభిమానులు ఈ ప్రచారాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ సినిమాని విజయ్‌కు అత్యంత నమ్మకస్తుడైన జగదీష్ ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతోంది. కేవలం కన్నడ సంస్థ నిర్మిస్తున్నందుకు సినిమా నిషేధించడం న్యాయం కాదు. జననాయకన్ విడుదల కోసం భాషా బేధాలకు అతీతంగా అందరూ ఎదురు చూస్తున్నారు అంటూ వారు అంటున్నారు.




Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R Publications, #6-31880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR.
Phone number 9177920459, email id : prajakshetram1@gmail.com, https://prajakshetram.in, RNI NO. TELTEL/12330